విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 06 నవంబరు 2025 8 పేజీలు

ప్రతి రైతును ఆదుకుంటాం

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్ధసారధి

విశాలాంధ్ర-నూజివీడు: మోంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతీ రైతుని, ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి చెప్పారు. నూజివీడు టీడీపీ కార్యాలయంలో బుధవారం పాత్రికేయులతో మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టం జరగకుండా ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం, కూటమి నాయకులు కార్యకర్తలు తుఫాన్ కు మూడు రోజుల ముందు నుండి ప్రజలను అప్రమత్తం చేసి, తుఫాన్ తరవాత సహాయక చర్యలు ▶మిగతా 2లో..

కాలుష్య కోరల్లో రైతులు

- తిరుపతిరాజుపేట, జె కొత్తూరు, రాజపూడిల్లో పంటలు పండని వైనం
- నష్టాల్లో రైతాంగం
- అక్రమ క్వారీతో ప్రజలకు అనారోగ్యం
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర - జగ్గంపేట : గత 15 సంవత్సరాలకు పైగా వ్యవసాయం చేసుకునే రైతులు ఎటువంటి పంటలు పండించుకోవడానికి నోచుకోకుండా నష్టాల బారిన పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని జె కొత్తూరు పంచాయతీ పరిధిలో ప్రధానంగా తిరుపతి రాజుపేట, జె కొత్తూరు, రాజపూడి గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ రైతులతో పాటు రాజపూడి జె కొత్తూరు గ్రామాల పై బూడిద వెదజల్లడంతో సంబంధిత ప్రజలు కూడా అనారోగ్యానికి గురైన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా ఈ గ్రామాల్లో రైతులు సన్నకారు, చిన్నకారు రైతులే తప్ప భూస్వాములు ఎవరూ లేకపోవడం వల్ల వారి అమాయకత్వాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రమ క్వారీ క్రషర్లు నిర్మించి లక్షల రూపాయలను గత 15 సంవత్సరాలుగా పొందుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తిరుపతిరాజుపేట గ్రామంలో ఉన్న క్రషర్లకు సరైన పర్మిషన్ లేదని సంబంధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో ఎటువంటి సంతకాలు తీసుకోకుండా క్రషర్ల నిర్మాణానికి ▶మిగతా 2లో..

ఆశల పల్లకిలో గ్రామ కంఠం భూములు

- చుక్కలు చూపిస్తున్న గ్రామ కంఠం/ ఆబాది భూములు
- ఇల్లు, ఇంటి స్థలం ఉన్నా కష్ట కాలంలో ఆదుకోవు
- కొన్నా, అమ్మినా రిజిస్ట్రేషన్లు జరగవు
- నిత్యం వారసత్వ తగాదాలు
- మూలకు చేరిన 361 జిఓ
- వచ్చే ఏడాది మార్చిలో యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీకి సన్నాహాలు
- స్వామిత్వ గాడిన పడుతుందా?

విశాలాంధ్ర -భీమవరం: పల్లెల్లో గ్రామ కంఠం భూములు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. గత పదేళ్లుగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వామిత్వ సర్వేలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో సర్వే శరవేగంతో జరుగుతోంది. గ్రామాల్లోని ప్రజలకు గ్రామ కంఠాల్లో నివసిస్తున్న ప్రజలకు యజమాన్య హక్కులు కల్పించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిందే స్వామిత్వ సర్వే. సర్వే అనంతరం గ్రామ కంఠం స్థలాల్లోని ఆసాములకు వచ్చే ఏడాది మార్చి తరువాత టైటిల్ డీడ్ ఇవ్వడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. 1923లో ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సర్వే చేసి గృహ యజమానులను గుర్తించి వాటికి సర్వే నెంబర్లను కేటాయించి రికార్డులు రూపొందించారు. కొంత భూమిని గ్రామ కంఠం పేరుతో పేద ప్రజల నివాస స్థలాలకు కేటాయించి దానికి ఏ సర్వే నెంబర్ కేటాయించలేదు. 1908 రిజిస్ట్రేషన్ యాక్ట్ 22ఏ లో దేవాదాయ, సీలింగ్, ప్రభుత్వం, ఈనామ్, ఎస్టేట్ భూములతో పాటు గ్రామ కంఠం భూములు కూడా చేరిపోయాయి. గ్రామ కంఠం స్థలాల్లో దశాబ్దాల క్రితం వెలసిన నాటి ఇళ్లు, స్థలాలకు ఇప్పటికీ యాజమాన్య హక్కుల్లేవు. వీటిని విక్రయించినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్ చేయరు. గ్రామ కంఠం భూములు నేడు ఊరి మధ్యకు వచ్చేసాయి. వాటి విలువ కూడా ▶మిగతా 2లో..

సమన్వయంతో ధాన్యం కొనుగోలు

కలెక్టర్ మహేష్ కుమార్

- ఏడిదలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - మండపేట : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు అధికారులు, మిల్లర్లు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు. బుధవారం మండపేట మండల పరిధిలోని ఏడిద గ్రామ పంచాయతీ రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లై చైర్మన్ తోట సుధీర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళారి వ్యవస్థలను అరికడుతూ రైతుకు న్యాయం చేకూర్చాలన్నారు. ధాన్యం ▶మిగతా 4లో..

మాతృ,శిశు మరణాలపై కలెక్టర్ ఆగ్రహం

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో మాతృ, శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదనే లక్ష్యంతో పని చేయాలని ఆదేశించినా, ప్రతినెల ఒక మరణం నమోదవుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన మాతృ మరణాలు, శిశు మరణాలపై సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో సమీక్షించిన సందర్భంలో మాతృ, శిశు మరణాలకు కారణమైన కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ పై తీసుకోమన్న చర్యలు ఏమయ్యాయి అని వైద్య శాఖ అధికారిని ప్రశ్నించారు. కుటుంబానికి మహిళ మూల స్తంభం అని, ఆమె చనిపోతే కుటుంబం మొత్తం చిన్న భిన్నం అవుతుందన్నారు. పిల్లలు విద్యకు దూరం కావడం తదితర సమస్యలు పెద్ద ఎత్తున తలెత్తుతాయన్నారు. జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాలు ఉండేలాగా కృషి చేయాలి అన్నారు. 2025-26 సంవత్సరం రెండో క్వార్టర్ లో జరిగిన ఒక మాతృ మరణం, రెండు శిశు మరణాలకు గల కారణాలను సుదీర్ఘంగా సమీక్షించారు. బాధిత కుటుంబ సభ్యులతో కూడా స్వయంగా మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కొన్ని కేసులలో ప్రైవేట్ హాస్పిటల్స్ గర్భిణికి ప్రసూతి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలలో నిర్లక్ష్యం ▶మిగతా 2లో..

ప్రకృతి వ్యవసాయమే మేలు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సానుకూల ఫలితాలను సాధించే దిశగా రైతులు చూపుతున్న చొరవను గుర్తిస్తూ, వారిని మరింత ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం స్థానిక ఇస్కాన్ గుడి సమీపంలోని ఒక ప్రైవేట్ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసే రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల దిగుబడి తగ్గకుండా, ప్రత్యామ్నాయ చర్యలను సమర్ధవంతంగా అమలు చేస్తున్న రైతుల అనుభవాలను కలెక్టర్ తెలుసుకున్నారు. నాణ్యమైన పంట ఉత్పత్తి కోసం రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులపై ఆధారపడకుండా ప్రకృతి పద్ధతులను అవలంబించడం అవసరమని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉపయోగించే బీజామృతం, జీవామృతం, గనజీవామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్యము వంటి కషాయాలు వంటివి రైతులు ఎలా సేకరిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. దేవరపల్లి మండలానికి చెందిన రైతు వెంకట రాజేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు ప్రారంభించిన తర్వాత పంట దిగుబడులు ▶మిగతా 2లో..

విశాలాంధ్ర

గురువారం 06|నవంబరు | 2025

విద్యార్థులకు విరాళం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన పదిమంది విద్యార్థులకు లక్షరూపాయల విరాళాన్ని యువజననేత వాడపల్లి రమేష్, భావనవిజయ దంపతులు బుధవారం విరాళంగా అంద జేసారు. గంగవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా,మండల కాపు సంఘం నాయకులకు

ఇందుకు సంబంధించిన లక్ష రూపాయల చెక్కును అందించారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క పాఠశాల నుంచి టాపర్ గా నిలిచిన పదిమందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున నగదును అందించాల్సిందిగా కోరారు. తొమ్మిదో తేదీ జంగారెడ్డి గూడెంలో నిర్వహించే మెట్ట ప్రాంత కాపు వన సమారాధనలో నగదు పురస్కారాన్ని విద్యార్థులకు అందజేస్తామని కాపు సంఘం మండల అధ్యక్షుడు మంచాల వెంకయ్య నాయుడు తెలిపారు.

దామెర్లచర్లలో ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలోని దామెర్లచర్ల గ్రామానికి చెందిన కేసుపాక వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు దైవ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం జరిగి ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఈ సంఘటనలో రూ. 50 వేల ఆస్తినష్టం సంభవించింది.

నేడు మోగల్లులో ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం మోగల్లు పశు వైద్యశాల వద్ద గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించ నున్నట్టు మండల పశు వైద్యాధికారిణి టి. హేమ తెలిపారు. ఈ పశు వైద్య శిబిరంలో పొర్లే పశువులకు, చూడి కట్టని పశువులకు చికిత్స, చూడి పరీక్షలు, పేడ, రక్త పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పాడి రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- పాలకోడేరు : రాష్ట్రమహిళ కమిషన్ సభ్యురాలు బూసి వినీత పాలకోడేరు మండలం విస్సాకోడేరులోని సఖి వన్ స్టాప్ సెంటర్‌ను బుధ వారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని ఫిర్యాదులు, కేసులు, బాధిత మహిళలకు అందించిన సహా

యంపై అధికారులను ఆరా తీశారు. బాధిత మహిళలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించి న్యాయం జరిగేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్ర మంలో సఖి సెంటర్ పరిపాలన అధికారి ధనలక్ష్మి, ఆకి వీడు సిడిపిఓ వాణి విజయరత్నం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయమే మేలు (1వ పేజీ తరువాయి)

మాత్రమే కాకుండా ఉత్పత్తి వ్యయాలు కూడా తగ్గాయని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో భూసారం పెరిగి, పంటలు ప్రకృతి విపత్తులను తట్టుకునే సామర్థ్యం పెరిగిందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయడం వలన భూమి దృఢత్వం పెరగడం, దుప్పు బలంగా ఉండడం వల్ల వరదలు, గాలివానలను తట్టుకునే శక్తి పెరుగుతోందని రైతులు పేర్కొన్నారు. రైతుల అనుభవాలను ప్రోత్సహిస్తూ, జిల్లా స్థాయిలో మరిన్ని శిక్షణా కార్యక్రమాలు, అనుభవ వినిమయ వేదికలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లిఖార్జునరావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, అడిషనల్ డీపీఎం మహబూబ్ వలి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రహం (1వ పేజీ తరువాయి)

కానవస్తుందన్నారు. సాధారణ ప్రెగ్నెన్సీ కేసును ఎలా ట్రీట్ చేయాలి, హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసును ఏ విధంగా ట్రీట్ చేయాలి అనే వ్యత్యాసాన్ని పూర్తిగా కేస్ స్టడీ ద్వారా అవగాహన చేసుకున్న తర్వాత మాత్రమే వైద్యాన్ని అందించాలని, వారికి అనుకూలంగా లేని కేసులను వేరే హాస్పిటల్స్ కు రిఫర్ చేయాలని సూచించారు. గొల్లవానితిప్ప అనాకోడేరు గ్రామం నివాసి కె.కృప ప్రసూతి మరణంపై సమీక్షిస్తూ చాలా హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్నప్పుడు ఈ విధంగా ట్రీట్ చేయడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల్లో చివరి వరకు వేచి చూడకుండా గర్భం దాల్చిన నాటి నుండే ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలని, ఒకవేళ గర్భవతి అయితే ఇబ్బంది ఉన్నప్పుడు వారికి ముందే అవగాహన కల్పించాలని ఆదేశించారు. భీమవరం మండలం చినరంగడి పాలెం నివాసి కె.సౌమ్య శిశువు మరణం, తాడేపల్లిగూడెం మెట్టుపర్రు గూడెం నివాసి సిహెచ్ రత్నకుమారి శిశువు మరణాలపై సమీక్షించారు. సమావేశంలో డిఎం అండ్ హెఓ డాక్టర్ బి.గీతా బాయి, కమిటీ మెంబర్లు డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూములు
(1వ పేజీ తరువాయి)

అమాంతంగా పెరిగిపోయింది. నివాసాలతో పాటు వాణిజ్య సముదాయాలు కూడా వెలిసాయి. వాటికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకపోవడంతో వీటి మీద అప్పులు పుట్టడం లేదు, తనఖాలు లేవు, బ్యాంకులు వీటిపై కన్నెత్తి చూడటం లేదు. ఇదిలా ఉంటే స్థలం యజమాని కాలం చేసిన సందర్భంలో ఆయన వారసులు ఆస్తులను పారీకత్తులు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోడానికి వీలులేకపోవడంతో ఇప్పటికీ సాదా బై నామా ద్వారానే వ్యవహారాలు జరుగుతున్నాయి. భూ సేకరణ ద్వారా గ్రామ కంఠంలోని స్థలాలు కోల్పోయిన యజమానికి నష్టపరిహారం పెద్దగా అందడంలేదు. దీనిపై అప్పట్లో సాగడపు విజయ అనే ఆసామి తన స్థలానికి టైటిల్ డీడ్ ఇవ్వాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై హైకోర్టులో వేసినా గెలవడంతో హైకోర్టు తీర్పు అనుసరించి ఇంటి నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయవచ్చని ఉమ్మడి ఎ.పి ప్రభుత్వంలో 361 జిఓ ఇచ్చారు. ఆ జిఓ ప్రకారం కూడా ఇప్పటికీ చాలా మందికి యాజమాన్య హక్కులు ఇంకా అందలేదు. జిల్లా వ్యాప్తంగా వేలల్లో గ్రామ కంఠం స్థలం సమస్యలు పేరుకు పోతున్నాయి. భీమవరం రూరల్లో చాలా గ్రామాల్లో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదాహరణకు మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామ ఎస్టేట్ భూములకు సంబంధించి గ్రామ కంఠం భూముల సమస్యలు పలు మార్లు వార్తల్లోకి వచ్చింది. స్వయానా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కొద్ది నెలల క్రితం దీనిపై సమీక్షించి ఎస్టేట్ పరిధిలో పాత రికార్డు ప్రకారం ఏ విధంగా ఉన్నది, ప్రస్తుత భూ పరిస్థితి ఏ విధంగా ఉన్నది సర్వే చేసి ఒక నివేదికను అందజేయాలని ఆదేశించారు. గ్రామ కంఠం భూముల్లో ప్రభుత్వ ఆస్తులను గుర్తించి వాటికి ప్రత్యేక సర్వే నెంబర్లు కేటాయించాలని, కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని జగన్నాధపురం, కోమటి తిప్ప గ్రామాల్లో కూడా సర్వే చేపట్టాలని ఆ సమీక్షలో జేసీ ఆదేశించారు. ఈ ఏడాది ప్రదమార్ధంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వామిత్వ సర్వేపై పలు ఆదేశాలు జిల్లా యంత్రాంగానికి జారీ చేశారు. గ్రామాల్లో గ్రామ కంఠం భూములు, ప్రభుత్వ, పంచాయతీ, పోరంబోకు, ఇరిగేషన్, పుంత, జడ్పీ, ఈనాం ఎండోమెంట్స్ కేటగిరీ వారీగా పక్కాగా స్వామిత్వ సర్వే జరపాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ ఆధారంగా ఆస్తుల కొలతలను, యజమానుల వివరాలను సర్వే బృందాలు సేకరిస్తున్నాయి. ప్రతి ఇల్లు, స్థలం పొడవు, వెడల్పు వివరాలతో డిసెంబర్, జనవరి మాసాల్లో యజమానులకు నోటీసులిచ్చి వాటిపై అభ్యంతరాలు ఉంటే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, యజమానల వివరాలను ప్రకటించి యాజమాన్య హక్కు పత్రాలను ఇవ్వనున్నారు.

కోరల్లో రైతులు
(1వ పేజీ తరువాయి)

పాల్పడినట్టు కొంతమంది రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ ఆధారిత పంటలు బయటకు విక్రయించడానికి తాత్కాలికంగా నిర్మించిన రహదారి ప్రస్తుతం గుంతలతో రాళ్లు రప్పలతో బూడిదమయంతో తయారైందని, దీనికి కారణం అతి భారీ వాహనాలు నడపడమేనని అన్నారు. ఆ రహదారి పై వాహనాలు పెద్ద సైజు రాళ్ళను రవాణా చేస్తూ క్రషర్లలో ఉపయోగించడమే దీనికి ప్రధాన కారణం అంటున్నారు. క్రషర్ యంత్రాలు పని చేసేటప్పుడు వచ్చే బూడిద పంటలపై పడి పంటలు సర్వనాశనం అవుతున్న విషయం గత 15 సంవత్సరాలుగా అందరికీ తెలిసిందేనని సంబంధిత శాసనసభ్యులు గాని, గతంలో పనిచేసిన శాసనసభ్యులు గానీ పట్టించుకోలేదని రైతులు పేర్కొంటున్నారు. దీనికి సంబంధించి పర్యావరణ అధికారి శంకరరావు బుధవారం పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకొని 15 రోజులు లోపు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. సౌత్ ఇండియా పార్టీ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ పులి ప్రసాద్ వెంటనే క్రషర్లను తొలగించి రైతులకు న్యాయం జరగకపోతే తీయించేంతవరకు పోరాడతానని అన్నారు.

ఆదుకుంటాం
(1వ పేజీ తరువాయి)

చేపట్టామన్నారు. తుఫానుకు ముందు, తర వాత కూడా అధికార యంత్రాంగం ఎంతో చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. పంట నష్టాలు, ఆస్థి నష్టాలను వెంటనే గుర్తించి రైతులకు, బాధిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. మోంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో 1, 63, 366 హెక్టార్లలో పంటల నష్టం జరిగిందన్నారు. గత సంవత్సర కాలంలో రాష్ట్రంలో తుఫానులు, వరదలు కారణంగా నష్టపోయిన రైతులకు 310. 30 కోట్ల రూపాయలు పరిహారంగా అందించా మన్నారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం పంట భీమా చెల్లించకుండా రైతులను మోసం చేసిందని, పార్లమెంట్‌లో కూడా దీనిపై చర్చ జరిగిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఆనాడు నారా చంద్రబాబునాయుడు ధర్నా చేస్తే రైతులకు అప్పటికప్పుడు పరిహారం అందించారని ధరల స్థిరీకరణ పేరుతో గత ప్రభుత్వం రైతులకు చేసిందేమి లేదన్నారు. రాష్ట్రంలో ఈ-క్రాప్ 97 శాతం వరకు పూర్తి అయ్యిందని, ఈ-క్రాప్ నమోదు కారణంగా ఏ రైతుకు పంట నష్ట పరిహారం చెల్లించడం ఆపలేదన్నారు. గతంలో తుఫాన్ అనంతరం కూలిన చెట్లను తొలగించేందుకు వారం రోజులు సమయం పట్టేదని, కానీ మొన్న తుఫాన్ సమయంలో కూలిన చెట్లను గంట నుండి 2 గంటలలోనే తొలగించి, రవాణా సౌకర్యాలను పునరుద్ధరించారని పార్థసారధి పేర్కొన్నారు.

ఏ తరానికైనా వందేమాతరం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ఆ తరం ఈతరం కాదు .. ఏ తరానికైనా వందేమాతరం స్ఫూర్తిదాయకమని, వందేమాతరం నినాదం ఆనాడు బ్రిటిష్ వారిని గడగడలాడించిందని మాజీ కౌన్సిలర్ మైలబత్తుల ఐజాక్ బాబు అన్నారు. భీమవరం పీఎస్ఎం బాలికోన్నత మున్సిపల్ హైస్కూల్లో బుధవారం

శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వందేమాతరం 150 ఏళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐజాక్ బాబు మాట్లాడుతూ భారత జాతి ఔన్నత్యాన్ని పెంచుతూ జాతీయ సమైక్యత భావంతో దేశ ప్రజల్లో శాంతి పురిగొల్పేలా బంకిం చంద్ర ఛటర్జీ వందేమాతరం గీతాన్ని రచించారని అన్నారు. హైస్కూల్ ఇన్‌ఛార్జ్ హెచ్ఎం షర్మిల మాట్లాడుతూ వందే మాతరం, జనగణమన గీతాలు భారతీయతను చాటుకుంటాయన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హైస్కూల్లోని 39 మంది విద్యార్థులకు వందేమాత రం గీతంపై పోటీలను నిర్వహించా మని, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు జీడిగుంట సునీత, గొట్టుముక్కల కల్యాణ్, మల్లివలుస రాము, కొండ్రు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

9న రాజంపేటలో మేజిక్ మహోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: 9వ తేదీ ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆంధ్రప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'మాయాలోకం' పేరున మేజిక్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన ప్రముఖ మెజీషియన్ మేజిక్ స్టార్ బోస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది ఇంద్రజాలికులు ఉత్సవంలో పాల్గొంటారని, పలు అంశాలపై మేజిక్ పోటీలు, మేజిక్ క్లాసులు, మేజిక్ పరికరాల అమ్మకాలు, సీనియర్ మెజీషియన్లకు సన్మానాలు జరుగుతాయని తెలిపారు. మేజిక్ రంగానికి విశిష్ట సేవలను అందించిన నలుగురు ప్రముఖ మెజీషియన్లకు తన పేరున 'మేజిక్ స్టార్' అవార్డుతో పాటు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల నగదు బహుమతితో తన చేతుల మీదుగా ప్రముఖ మెజీషియన్లు డాక్టర్ కె.వి.వి.వి. కుమార్ (ఖమ్మం), యు.పి.రాయుడు (రాజంపేట), యస్.కళ్యాణ్ (వరంగల్), జాదూగర్ అవినాష్ (ముంబాయి) సత్కరించినున్నట్లు ఆయన వివరించారు.

కృష్ణబలిజ పూసల సమాజాభివృద్ధికి నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర -భీమవరం: కృష్ణ బలిజ, పూసల సమాజ అభివృద్ధి, విద్య, ఉపాధి, కుల వర్గీకరణ సంబంధిత అంశాలపై ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లాలని కృష్ణబలిజ పూసల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గంటా త్రిమూర్తులు ప్రతిపాదించారు. విజయవాడ బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం వివిధ బీసీ వర్గాల సమస్యలు, అభ్యున్నతి కార్యక్రమాలపై

బీసీ సంక్షేమం, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితమ్మ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ, సమాజానికి మరిన్ని శిక్షణా విధానాలు, ఉపాధి అవకాశాలు, విద్యార్థుల ప్రోత్సాహక పథకాలు విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు.

బస్సు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం జూబ్లీ నగర్ వద్ద బస్సు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రాజ్ కుమార్‌ను ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న బాబు అరెస్టు చేశారు. ఈడ్రైవర్‌ది అశ్వరావుపేట. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు కేసు నమోదు చేశారు. చింతలపూడి సిఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో బస్సు ప్రమాదానికి సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది.

75 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర -నూజివీడు :నియోజకవర్గంలో 75 కుటుంబాలకు రూ.35.01 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందించారు. బుధవారం నూజివీడు నియోజకవర్గ తెలుగు దేశం కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అటువంటి మంచి ప్రభుత్వాన్ని అన్ని వర్గాలు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. 16 నెలలు కాలంలో నూజివీడు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు 995 మందికి రూ 7.14 కోట్లు అందజేశామని అన్నారు. ఇంకా 554 మంది దరఖాస్తులు చేసుకోగా అవికూడా వెరిఫైచేయించి త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. జీఎస్టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి రూ.8 వేలు నుంచి రూ .12 వేలు ఆదా అవుతుందన్నారు. కూటమి పెన్షన్లు సొమ్ము పెంపు, మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందించామని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పరింపూడి గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించడం కోసం పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఆదేశాల మేరకు, 18 లక్షల రూపాయల విలువగల నూతన ట్రాన్స్‌ఫార్మర్లను గ్రామపంచాయతీ పరిధి తారక రామానగర్, సురక్ష ఆసుపత్రి ఏరియాలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ ముప్పిడి విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ లోవోల్టేజ్ సమస్య ఎక్కువగా ఉన్నదని శాసనసభ్యులకు తెలియజేయగా, ఆయన వెంటనే సంబంధిత ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ డిఈకి నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల స్తంభాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాలలో లోవోల్టేజ్ సమస్య తగ్గటమే కాకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా నూతనంగా నిర్మిస్తున్న మూడు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులకు సప్లై ఇవ్వటానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ఎంతో ఉపయోగపడతాయని విజయకుమారి తెలిపారు. బుధవారం జనసేన పట్టణ అధ్యక్షులు మాదేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చిన్నబాబు, ఊసల రాజేష్, పూలపల్లి చిన్న రాజా, ఊసల సుభాష్ చంద్రబోస్, రాజు, వార్డు మెంబర్ ఏలేటి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలు, మీడియా సహకారంతోనే సహాయక చర్యలు ఫలప్రదం

విశాలాంధ్ర -ముదినేపల్లి : ప్రజలు , మీడియా సహకారంతోనే మొంథా తుఫాన్ సహాయక చర్యలు ఫలప్రదం అయ్యిందని తహసీల్దార్ ఎస్.కె లతీఫ్ పాషా పేర్కొన్నారు. ఇటీవల మొంథా తుఫాన్‌కు జిల్లాలో ముదినేపల్లి మండల తహసీల్దార్ ఎస్కే లతీఫ్ పాషా అందించిన సేవలను ప్రశంసిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన సైక్లోన్ మొంథా తుఫాన్ ఫైటర్ గౌరవప్రదమైన అవార్డును పురస్కరిస్తూ మండల రెవెన్యూ కార్యాలయంలో శాలువాలు కప్పి పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి బొంగు రవికుమార్, పెదపాలపర్రు సర్పంచ్ గంటా రాకేష్ కుమార్, గన్నమనేని శివ, మాడపాటి హేమంత్, పుట్టి లక్ష్మణస్వామి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పంట కాల్వలో వ్యర్థాల తొలగింపు

విశాలాంధ్ర- ఉండి :ఉండి మెయిన్ పంట కాల్వలో పేరుకుపోయిన తూడి, గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాలను ప్రొక్లెయిన్‌తో తొలగించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఆదేశాల మేరకు డిసి చైర్మన్, వైస్ చైర్మన్ తోట పణి బాబు, మంతెన సాయిలచ్చిరాజు, ఇరిగేషన్ అధికారులు తొలగింపు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిసి చైర్మన్, వైస్ చైర్మన్, ఫణి బాబు, సాయిలచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు మాట్లాడుతూ ఉండి మెయిన్ పంట కాల్వలో నీరు కలుషితం కాకూడదనే ఉద్దేశంతో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నా మన్నారు. వ్యర్థాల తొలగింపుతో తాగు, సాగునీరుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారుదల సక్రమంగా జరిగే విధంగా పూర్తి చేస్తామన్నారు. మెయిన్ పంట కాలువకు ఆనుకొని ఉన్న పాములపర్రు వంటి అనుసంధాన పంట కాలువలను తూడి, గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడం జరిగిందని ఫణి బాబు, సాయిలచ్చిరాజు, నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది, కృష్ణ, ప్రసాదు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు కాగిత బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏఎస్‌పిపై ప్రజల ఆశలు..!

విశాలాంధ్ర-లింగపాలెం: జంగారెడ్డి గూడెం పోలీసు శాఖ సబ్ డివిజన్ ఏ.ఎస్.పి సుస్మిత రామనాథన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ డివిజన్కు తొలిసారి ఐపీఎస్ క్యాడర్ అధికారిణి నియమిం చారు. తొలిసారి ఐపీఎస్ అధికారి డివిజన్కు రావటాన్ని ప్రజలు స్వాగతిస్తు న్నారు. డివిజన్ పరిధిలో జంగారెడ్డి గూడెంలో రెండు, లక్కవరం, తడికలపూడి, చింతలపూడి, ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్లు, ఈ పరిధిలో ఇద్దరు సిఐలు పనిచేస్తున్న సంగతి తెలిసిందే. డివిజన్ పరిధిలో ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయి. డివిజనులో నాటుసారా తయారీ జరుగుతుంటుంది. కోడిపందాలు,పేకాటకు డివిజను పేరుపొందింది. ఈ డివిజన్లో కొందరు రాజకీయ నాయకులు తమ ఆధిపత్యం కోసం తెరవెనుక లాబీయింగు నడుపు తుంటారు.పైకి మామూలుగానే ఉంటుంటారు. ఆధిపత్యం కోసం అంతర్లీ నంగా వ్యవహారాలు చేస్తుంటారు. వీరిని నివారించడంలో ఏ.ఎస్.పి తీసుకునే చర్యలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. డివిజను కోడిపందాలకు పెట్టింది పేరు. సంక్రాంతి సమయంలో ముందు కోడిపందాలు జరగనివ్వమని పోలీసులు హెచ్చరికలు చేస్తుంటారు.ఆతరువాత చివరి నిమిషంలో అనుమతులు ఇవ్వటం జోరుగా పందాలు నిర్వహించటం సాంప్రదాయంగా కొన సాగుతూ వస్తుంది. వీటిని ఏఎస్పి ఎలా నివారి స్తారు? ఇది జంతు ప్రేమికులు కోడిపందాల వ్యతిరేకు లలో నెలకొన్న ప్రశ్న. కోడిపందాల సమయంలో ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కే. గోకవరంలో కోడిపందాలు నిర్వహించే నిర్వాహకులు వ్యవహరించే తీరుపై ప్రజల్లో తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఇక్కడ సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందాలతో పాటు బహిరంగంగా పేకాట ఆడిస్తూ ఉంటారు. దీన్ని ఎవరన్నా ప్రశ్నిస్తే వారిపై దాడులకు దిగుతుంటారు. నిర్వాహ కులు కొందరు రౌడీయిజంగా వ్యవహరిస్తుం డటం ప్రజల్లో భయాందోళనకు గురి చేస్తుంది. వీరు బౌన్సర్లను కాపలాగా పెట్టుకుంటారు. శాంతిభద్రతలు కాపాడ టంలో అసాంఘిక కార్యక్రమాలు,జూదాలను నివారించటంలో, నాటు సారా తయారీని అరికట్టడంలో ఏ.ఎస్.పి కీలకంగా వ్యవహరిస్తారని ప్రజలంతా ఆశతో ఎదురుచూస్తున్నారు.

పశువుల్లో గర్భకోస వ్యాధులు రాకుండా చూడాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం జల్లి కొమ్మర రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థకశాఖలు ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల శిబిరాన్ని , మేలుజాతి దూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కూరెళ్ళ వెంకటరత్నం, టీడీపీ నాయకులు కవల కోదండ రాంబాబు, మద్దాల మహంకాళి ప్రారంభించారు. నిపుణులైన వైద్యులు పశువులకు పరీక్షలు చేసి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. లేగ దూడల ప్రదర్శనలో దూడల పోషణ పై రైతులకు సూచనలు ఇచ్చారు. లింగ నిర్ధారిత వీర్యం గురించి పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎల్ కె సుధాకర్ వివరించారు. పాడి పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి చూడి కట్టించడం తద్వారా పాల ఉత్పత్తి పెంచడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 60పశువులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డీఎం నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.మహేష్, డాక్టర్ అశోక్, డాక్టర్ సునీల్, జి. సురేష్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, పశు వైద్య సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌశలం మాక్ టెస్ట్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: నవంబర్ 6న నిర్వహించే "కౌశలం" సర్వే మాక్ టెస్ట్ కు జిల్లాలోని అన్ని సచివాలయాల్లో వెబ్ క్యాముల ఏర్పాట్లును పూర్తి చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. "కౌశలం సర్వే" అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం చేపట్టిన ఒక కార్యక్రమం అన్నారు. కౌశలం సర్వే ద్వారా జిల్లాలో గుర్తించిన 1,09,347 మందికి అర్హత పరీక్ష నిర్వహించే ముందుగా జిల్లాలోని 535 సచివాలయాల్లో ఏర్పాటుచేసిన వెబ్ క్యాముల ద్వారా సచివాలయ సిబ్బంది అయిన డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నవంబర్ 6వ తేదీ సాయంత్రం 4 గంటలనుండి 4.30 గం"ల వరకు, సాయంత్రం 4.45 గం" నుండి 5.15 గం"ల వరకు రెండు బ్యాచ్ ల్లో మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత వర్క్ ఫ్రం హోం సర్వే ద్వారా పదో తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారి వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. అనంతరం అర్హత కలిగిన 1,09,347 మందిని ఎంపిక చేసి కౌశలం సర్వేలో భాగంగా యువత చదువుకున్న చదువు, వారి నైపుణ్యాలు, ఇతర వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు.

ట్రావెల్స్ యజమాని ఆచూకి ఏది?

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం జుబ్లీ నగర్ వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో భారతి ట్రావెల్స్ బస్సు బోల్తా పడి ఒకరు మృతి చెంది 14మంది గాయపడిన సంఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా బస్సు యజమాని ఆచూకీ లేదు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం సేవించి రాష్ డ్రైవింగ్ చేయటం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. ట్రావెల్స్ యజమాని పెద్దగా అనుభవం లేని డ్రైవర్ను పెట్టుకోవడం వల్లే ఈ సంఘటన జరిగిందని ప్రయాణికులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రావెల్స్ యజమాని చనిపోయిన కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించాల్సి ఉండగా అటువంటిది ఏమీ జరగలేదు. దీంతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. ప్రమాదంలో మృతి చెందిన యువకుని కుటుంబా నికి, గాయపడిన వారికి ట్రావెల్స్ యజమాని ఆర్థిక సాయం చేయాల్సి ఉండగా ట్రావెల్స్ యజమాని నుంచి ఎటువంటి స్పందన లేదు.ఈ పరిస్థితులపై జిల్లా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.ట్రావెల్స్ బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు భయాందోళనతో ఉన్నారు.ప్రత్యామ్నాయ సౌకర్యాలు లేకపోవడం వల్ల దూర ప్రాంతాలు వెళ్లే ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్ పైనే ఆధారపడుతున్నారు. ప్రయాణికుల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అలా వ్యవహరించకపోతే ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రమాదాలు నివారించ టానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకొంటారో వేచిచూడాలి.

ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 11, 12వ తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యన్. మోహనదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహిళా, పురుష ఉద్యోగులు తమ ఐడి, సిఎఫ్ఎంఎస్ ఐడి లతో భీమవరంలోని డిఎన్ఆర్ గ్రౌండ్స్ కు ఉదయం 9 గంటలకు నిర్దేశించిన తేదీల్లో హాజరు కావాలని ఆయన సూచించారు. 11వ తేదీన అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, ఫుట్ బాల్ ఖోఖో, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీ బాల్, రెస్లింగ్, స్విమ్మింగ్ విభాగాలలో 12వ తేదీన క్రికెట్, యోగ, మ్యూజిక్, డాన్స్, షార్ట్ ప్లే విభాగాల్లో ఎంపిక జరుగుతుందని ఆయన వివరించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని నవంబరు 19 నుండి 22 వరకు జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడతారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9640503679 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

'భారత రాజ్యాంగం మహోన్నతమైంది

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల,రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వ ర్యంలో బుధవారం "భారత రాజ్యాం గము - ప్రాథమిక హక్కులు" అనే అంశంపై విస్తృత సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ "భారత రాజ్యాంగం మహోన్నత మైందని, ఎందరో మహామహులు ఈ రాజ్యాంగ రచనకు పూనుకున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం వల్లనే భారత పౌరులకు స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము పొందగలుగు తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ "భారత రాజ్యాంగం భారత ప్రజలకు శిరోధార్యము అని, భారత రాజ్యాంగము భారత దేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో గొప్ప మార్పు తెచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు,గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ బదరి నారాయణ, రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ "భారత రాజ్యాంగం భారతీయ ప్రజలకు గొప్ప భరోసా ఇచ్చిందని భారత రాజ్యాంగం వల్లనే భారతదేశంలో వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కూడా మహోన్నత మైన పదవులు అలంకరించగలిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల ఉపన్యాసకులు డాక్టర్ జి. శ్రీనివాసరావు, కళాశాల తెలుగుశాఖ ఉపన్యాసకులు డాక్టర్ జివి లాల్, అర్థశాస్త్ర ఉపన్యాసకులు వి. హనుమంతరావు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

కూటమి పాలనతో ప్రజలకు తీరని నష్టం

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు మాజీ శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు) అన్నారు. బుధవారం నెలవరం మండలం అడవికొలను గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల ప్రజలకు తీరని నష్టం వాటిల్లుతోందని అన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ జరిగిందని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం అసంబద్ధమైనదని, దీనిపై ప్రభుత్వం ప్రజాభిప్రాయం కోరాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిడమర్రు మండల వైసీపీ అధ్యక్షుడు సంకు సత్యకుమార్, జడ్పిటిసి కోడే కాశీ, వెజ్జు వెంకటేశ్వరరావు, నిమ్మల బుజ్జి,సుభాష్ వైసీపీ నాయకుల, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్ విజయవంతం

విశాలాంధ్ర -నూజివీడు : ఆర్‌జీయూకేటీ నూజివీడులో నవంబర్ 2 నుంచి 3 వరకు రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ (సికింద్రాబాద్) డైరెక్టరేట్ పరిధిలో ఐడియా ఇన్నోవేషన్ ఇంటర్ గ్రూప్ కాంపిటిషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలను కాకినాడ గ్రూప్ ఆధ్వర్యంలో 17 ఆంధ్ర బెటాలియన్, విజయవాడ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్ తోమర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణలో డైరెక్టరేట్ పరిధిలో మొత్తం 9 గ్రూపుల్లో హెడ్ క్వార్టర్స్ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రతి గ్రూప్ నుండి సాంకేతిక నైపుణ్యం కలిగిన రెండు ప్రాజెక్టులు ఎంపిక చేసి పోటీలను నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా లెఫ్టినెంట్ కల్నల్.హెచ్. లలిత్ బాబు, బి. వినోద్ బాబు (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌జీయూకేటీ నూజివీడు) బాధ్యతలు నిర్వర్తించారు. పోటీలలో హైదరాబాద్ గ్రూప్ క్యాడెట్లు మొదటి స్థానం, తిరుపతి గ్రూప్ రెండో స్థానం, గుంటూరు గ్రూప్ మూడో స్థానం, కాకినాడ గ్రూప్ నాలుగో స్థానం, మరియు తిరుపతి గ్రూప్ మళ్లీ ఐదవ స్థానం సాధించారు.

కొనుగోలు (1వ పేజీ తరువాయి)

కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవే క్షిస్తామన్నారు. రైతులు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునే అవకాశముందన్నారు. ధాన్యం విక్రయించిన 24 నుండి 48 గంటలలోపే ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.

ఖరీఫ్ రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధమైన జిల్లా యంత్రాంగం ఈ మేరకు పలు జాగ్రత్తలు తీసుకుందన్నారు. ముఖ్యంగా గన్ని బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్టు వంటి సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గన్ని బ్యాగ్స్ సరఫరాలో దళారులను అరికట్టడానికి చొరవ తీసుకోవాలని, ప్రతి అంశం డాష్ బోర్డులో అందుబాటులో ఉంటుందని పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయంలో ఫార్మర్ ఫ్రెండ్లీ విధానాల ద్వారా రైతులకు స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన సమయంలో ధాన్యం విక్రయించుకునే అవకాశం ఇచ్చారన్నారు. రైతులు సులభంగా వాట్సాప్‌లో హాయ్ పంపడం ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియలో చేరే సౌకర్యాన్ని కల్పించారన్నారు. సివిల్ సప్లై చైర్మన్ తోట సుధీర్ ప్రసంగిస్తూ రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సకల ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ప్రసంగిస్తూ గ్రామ వ్యవసాయ సహాయకుడు ఈ పంట, ఈకేవైసీ నమోదు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు చెల్లించే గన్నీలు, లేబర్ రవాణా ఛార్జీలను ప్రదర్శించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2 వేల వాహనాలను ధాన్యం రవాణా కోసం ఎంపిక చేసి 1300 వాహనాలకు జిపిఎస్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. కస్టోడియన్ అధికారి ధాన్యం వాహనాన్ని సకాలంలో అన్లోడ్ చేయించాలన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు, నల్లమిల్లి వీర్రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా సుస్మిత

విశాలాంధ్ర - జంగారెడ్డి గూడెం : జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ సూపరిం టెం డెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ)గా సుస్మిత పదవీ బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటివరకు డిఎస్పీగా పని చేసిన రవిచంద్ర నుంచి బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర - గణపవరం: కార్తీక పౌర్ణమి పురస్క రించుకొని బుధ వారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలో వేంచేసిఉన్న స్వయంభూ పార్వతి భీమేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించు కొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-వీరవాసరం: విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ప్రధానోపాధ్యా యులు ఎం.ఎన్.వి పెద్దిరాజు తెలిపారు. మండలంలోని అండలూరు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం క్రీడాకారులు షేక్ షిలారి బీబీ, బంటు అవినాష్‌లను ప్రధానోపాధ్యాయులతో పాటు, క్రీడా ఉపాధ్యాయుడు పంతంకాని శ్రీనివాస్, విద్యాకమిటీ ఛైర్పర్సన్ తమ్మినీడి రమాదేవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ నెల 4న ఏపీ సాంఘిక సంక్షేమ సంక్షేమ ఉన్నత పాఠశాల పెదవేగిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14.17 కేటగిరిలో వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్‌లో అండర్- 14 విభాగంలో షేక్ షిలారిబీబీ ఎంపికైంది. ఈమె ఈ నెల 22,23,24, తేదీలలో వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొననున్నది. బేస్బాల్ అండర్ -17 విభాగంలో బంటు అభినాష్ ఎంపికవడంతో ఈ నెల 27, 28, 29 తేదిలలో నంద్యాల జిల్లా అహోబిలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పెద్దిరాజు తెలిపారు.

శివాలయాలు కిటకిట

విశాలాంధ్ర-వీరవాసరం: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు తెల్లవారుజాము నుండి భక్తులతో కిటకిటలాడాయి. వీరవాసరంలో వేంచేసియున్న వీరేశ్వర, విశ్వేశ్వర ఆలయం, రాయకుదురు లో వేంచేసి ఉన్న శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానం శివాలయంలో భక్తులు పోటెత్తారు. స్వామి వారికి అభిషేకాలు, జ్యోతిర్లింగార్చన ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణి క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. నం.	ఎల్‌ఏఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్‌ఎక్కౌంట్‌నెం.**MHFLCONRJM000005013135** **1.చిలకా వెంకటరావు 2.చిలకా భారతి 3.చిలకా చిన్న ఏసు**	07-ఆగస్టు 2025	**05-ఆగస్టు-2025 నాటికి రూ.11,87,227.35/-**	**04-నవంబరు -2025**

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా, జేఆర్ గూడెం ఎస్ఆర్ఓ పరిధి, కొయ్యలగూడెం మండలం, పరింపూడి రెవిన్యూ గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ఆర్.ఎస్.నం.380 వద్ద ఉన్నది 1620 ఎస్ఎఫ్‌టి నిర్మిత ప్రదేశంతో మొదటి అంతస్తు కలిగియుండి నిర్మాణంలో ఉన్న ఆర్‌సిసి పైకప్పు నివాసిత భవనంతోపాటు 193.6 చదరపు గజాల భూమితో కూడిన ఆస్తి యావత్తు. **హద్దులు:** తూర్పు: సిసి రోడ్డు, దక్షిణం: సి.సి. రోడ్డు, పడమర: షేక్ గౌస్య బేగంకు చెందిన షెడ్, ఉత్తరం: బ్రహ్మాజు కామేశ్వరరావుకు చెందిన షెడ్.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: పశ్చిమగోదావరి, తేదీ: 06 నవంబరు 2025 **సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున**

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో తణుకు

O.S.No.493/2020

బిట్వీన్ :

బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆలమూరు బ్రాంచి .... వాది

మరియు

పట్టిసపు విజయ్‌కుమార్ మరియొకరు

.... ప్రతివాదులు

To : Defendant No.1 :
Pattisapu Vijay Kumar,
S/o Raghavendra Rao, H/M, Agriculture, Sambhunipeta, Palakollu, Palakollu (M), W.G., A.P.
To : Defendant No.2 :
Vemula Yerraiah, S/o Suranna, H/M, Agriculture, Gaggiparru (V), Elamanchili Mandal, W.G., A.P.

పై నంబరు దావాలో **1వ, 2వ ప్రతివాదులు** అయిన మీరు కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందును శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది. **18-11-2025**వ తేదీకి వాయిదా వేసినారు. కావునా ఆరోజు **ఉదయం 10.30** ని॥లకు మీరు శ్రీ పైకోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

CH. DURGA POORNIMA
Advocate, Eluru, 7386441140

బందపురంలో రేషన్ షాపు తనిఖీ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం బందపురంలో రేషన్ షాపును ఏఎస్ఓ నాగాంజనేయులుసివిల్ సప్లై డిటి సత్యనారాయణ పరిశీలించారు . ఈ సందర్భంగారేషన్ కార్డుదారులకు రేషన్ బియ్యం నాణ్యత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేషన్ షాప్ డీలర్ కాసాని వెంకటేశ్వర్లు, రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

విశాలాంధ్ర - దేవరపల్లి : కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ వార్షిక తనిఖీలో భాగంగా దేవరపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. నేర నియం త్రణలో భాగంగా ముందుస్తు చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఫుట్ పెట్రోలింగ్ సాయంత్రం సమయం లో నిర్వహించాలని, సైబర్ నేరాలపై ప్రజలుకు అవగాహన కల్పించే విధంగా మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా సిబ్బంది అందరు ఉండాలని, క్రైమ్ రేట్ తగ్గించాలని దేవరపల్లి పోలీస్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అయిన వి.సుబ్రహ్మణ్యం, దేవరపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండలంలోని తాడిపూడి సొసైటీ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొను గోలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పి.పి కేంద్రాలును ప్రారంభించినట్లు తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు పేర్కొన్నారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ, సకాలం లో రైతుకు డబ్బు చెల్లించే భాధ్యత కూడా తమ ఎన్డీయే ప్రభుత్వం తీసుకుందని సొసైటీ అధ్యక్షులు కొండబాబు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం తాడిపూడి సొసైటీ లోను, సొసైటీ పరిధి లోకి వచ్చే కుకునూరు లోను ధాన్యం కొనుగోలు కేంద్రాల ను కొండబాబు ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్ల విషయం లో ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకు రావచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సొసైటీ డైరెక్టర్లు రంగనా యకులు, గొంతు సతీష్ స్థానిక నాయకులు పాల్గొన్నారు. తాళ్లపూడి మండలం కుకునూరు లో జరిగిన కార్యక్రమం లో టీడీపీ నాయకులు నామన పరమేశ్వరరావు, ఉడతా వీరేంద్ర, వ్యవసాయాధికారిని రుచిత, సొసైటీ కార్యదర్శి బొర్రా రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

హెూమియోపతి కళాశాలకు రూ. 3 కోట్లు మంజూరు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్ మెంట్ ద్వారా మరో రూ. 3 కోట్లు హెూమియోపతి కాలేజీకి మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బుధవారం వెల్లడిం చారు. ప్రస్తుతం చేస్తున్న పనులకు అదనంగా మౌలిక వసతులు, ఇతరత్రా పనులకు సంబంధించి మూడు కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్తిక పౌర్ణమి నాడు ఒకదాని తర్వాత ఒక శుభవార్త వింటున్నామని ఆయన ఆనందం వ్యక్తంచేసారు. బాధ్యతగా పనులు చేస్తూ,ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిదిద్దుతున్నామని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు.

పేదవారికి భరోసా సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రాజమండ్రి రూరల్ నియోజక వర్గం పరిధిలో సీఎం సహాయ నిధులు విడుదల చెయ్యడం ద్వారా 15 మంది లబ్ధిదారులకు రూ.11.89 లక్షల చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ. 11.89 లక్షల విలువైన చెక్కులు 15 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమైన పేదవారికి కొండంత భరోసాగా, మానవతా దృక్పథంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని పేర్కొన్నారు. "ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తోందన్నారు. మొత్తం రూ. 11,89,387 విలువైన 13 చెక్కులను, రెండు ఎల్ వో సి పత్రాలను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

ఓటర్ల సౌకర్యార్థం "బుక్ ఏకాల్ విత్ బిఎల్ ఓ" సదుపాయం

విశాలాంధ్ర - గోపాలపురం : జాతీయ ఎన్నికల కమిషన్ ఓటర్ల సౌకర్యం కోసం "బుక్ ఏకాల్‌విత్‌బిఎల్ఓ"అనే నూతన సదుపా యాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చిందని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్ సాయి ప్రసాద్ తెలిపారు. బుధ వారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఈ నూతన విధానానికి సంబంధించిన మాడ్యూల్ గోడ పత్రికను ఆవిష్క రించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నూతన విధానాన్ని నియోజక వర్గ ఓటర్లు సమర్థవంతంగా విని యోగించు కోవాలని కలెక్టర్ చేకూరి కీర్తి ఆదే శాల మేరకు ఓటర్లకు అవగాహనను మెరుగు పరచడం, ఫెసిలిటేషన్ చర్యలను వేగవంతం చేయడం లక్ష్యంగా ఈ మాడ్యూల్‌ను అమలు లోకి వచ్చిందని అన్నారు. జాతీయ ఫిర్యాదుల సేవా పోర్టల్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న ఒక సమగ్ర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం అని తెలిపారు. దీని ద్వారా ఓటర్లు తమ ఓటర్ నమోదు, సవరణలు, ట్రాన్స్‌ఫర్, లేదా బిఎల్ఓ సంబంధిత ఫిర్యాదు లను నమోదు చేసి తగిన పరిష్కారం పొంద వచ్చు అని తెలిపారు. ఓటర్లు జాతీయ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ లేదా వోటర్ సర్వీస్ పోర్టల్‌లో "బుక్ఏకాల్ విత్‌బిఎల్ఓ" ఆప్షన్‌ను ఎంచుకొని తమ వివరాలు నమోదు చేయవచ్చు అన్నారు. అలా నమోదు చేసిన విన్నపాలకు బిఎల్ఓలు 48 గంట ల్లోగా స్పందించి, సమస్య పరిష్కారా నికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఓటర్ల సౌకర్యం, పారదర్శకత, సమయోచిత సేవలందించిన ఈ కొత్త మాడ్యూల్ ఎంతో ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఓ జోడాల వెంకట్, ఎన్నికల సీనియర్ సహాయకులు నల్లరాజు వి.ఆర్.ఓ కాసిం తదితరులు పాల్గొన్నారు.

పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - పెరవలి : పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండల నూతన కార్యవర్గం ముఖ్య అతిథులు గౌరవ అధ్యక్షులుగా వీర భద్ర రావు, భద్ర హాస్పిటల్ తణుకు ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షులుగా కృష్ణారావు, జిల్లా కార్యదర్శి గా కిరణ్ స్వరూప్ , పెరవలి మండల అధ్యక్షులుగా నక్కా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ బాబ్జి, కార్యదర్శిగా కొసన నాగబాబు, ఉపాధ్యక్షులుగా సతీష్, సహాయకార్యదర్శిగా సతీష్, షేక్ వసీమ్, గణేష్, కేశవ స్వామి, నరసింహరావు, కేతా సూర్యనారాయణ, భూపతి వెంకటపతి, శాంతి ఎన్నుకొన్నారు.

శరవేగంగా ఆర్ఓబి నిర్మాణం పూర్తి

విశాలాంధ్ర - నిడదవోలు : ఆర్ఓబి నిర్మాణ పనులను త్వరత గతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ శాసన సభ్యులు,నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న ఆర్వోబీ బ్రిడ్జ్ నిర్మాణ పనులను బూరుగుపల్లి శేషారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణుల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో ఆర్ఓబి నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరావు, టీడీపీ పట్టణకార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, నిడదవోలు మండల టీడీపీ అధ్యక్షులు వెలగన సూర్యారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని దోమల నివారణ చర్యలు

విశాలాంధ్ర - సీతానగరం: వాతావరణం మార్పుల నేపథ్యంలో గ్రామాల్లో దోమలు బెడద ఎక్కువగా ఉంది. మండల వ్యాప్తంగా ఉన్న 21 గ్రామ పంచాయతీలలో దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు అని ప్రజలు ఆరోపిస్తు న్నారు. గత ప్రభుత్వంలో 21 పంచాయతీలలో దోమల నివార ణకు ఫాగ్ యంత్రాలను అందించింది. అయితే ఈ యంత్రా లను వినియోగం పై ఎటువంటి శిక్షణ ఇవ్వకపోవడంతో అధికారులు వీటిని వినియోగించడం లేదు. అలాగే డ్రైనేజీల వద్ద దోమల నివారణకు అబెట్ పిచికారి చేయాల్సి ఉండగా అది కూడా కాన రావడం లేదు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక అప్పుడు దోమల పై దండ యాత్ర అంటూ గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన దోమల నివారణ చర్యలు చేపట్టే వారు అని నేడు ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ దోమల వల్ల పిల్లలు, వృద్ధులకు జ్వరాలు పాలు అవుతున్నారు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో బాగంగా అనేక పారిశుధ్య కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పూర్తిగా అమలు కావడం లేదు అని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఏదేమైనా ప్రజలను దోమల నుండి రక్షించే విధంగా చర్యలు చేపట్టి జ్వరాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వివిధ శాఖల పనితీరు పై సమీక్ష

విశాలాంధ్ర - సీతానగరం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎంపిడిఓ ఎమ్ భారతి, హౌసింగ్ డి ఈ రామారావు ఆధ్వర్యంలో సమీక్షా

సమావేశం నిర్వహించారు. దీనిలో ప్రధానంగా హౌసింగ్, పారిశుద్ధ్యం, తాగు నీరు మొదలగు వాటి పై మండల అధికారులతో సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ భారతి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సొంతింటి కల నెరవేరే విధంగా గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్యం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ ప్రకాష్, పంచాయతీరాజ్ ఏఈ జోయల్, హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, ఏవో సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పరిశుభ్రత పనులు

విశాలాంధ్ర- కొవ్వూరు: గోదావరి హారతి, కార్తీక మాసం సందర్భంగా కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పరిశుభ్రత పనులు యుద్ధ ప్రాతి పదికన జరిగాయి. రెండు టీములుగా ఏర్పడి క్షేత్రానంత శుభ్రం చేశారు. ఇన్చార్జి ఇన్స్పెక్టర్ రవికుమార్, సానిటరీ మేస్త్రి అప్పారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కందుకూరి రాజ్యలక్ష్మమ్మ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర – రాజమండ్రి సిటీ: కందుకూరి రాజ్యలక్ష్మమ్మ మహిళా సాధికారతకు, బాలికల విద్యా భివృద్ధికి సేవలందించిన మహెూన్నత వ్యక్తి అని స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాఘవ కుమారి అన్నారు. బుధ వారం కందుకూరి రాజ్యలక్ష్మమ్మ జయంతిని పుర స్కరించుకుని స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కందుకూరి రాజ్యలక్ష్మి , మహాముని కందుకూరి వీరేశలింగం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరి వీరేశలింగం తెలుగు సమాజంలో సామాజిక సంస్కరణలకు ఆద్యుడని, విద్యా విస్తరణకు, మహిళా శిక్షణా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని, ఆయన సతీమణి రాజ్యలక్ష్మమ్మ కూడా ఆయనతో పాటు మహిళా సాధికారతకు, బాలికల విద్యా అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కందుకూరి పుణ్యదంపతుల జీవితం యువతకు ప్రేరణగా నిలవాలని, సమాజ సేవా భావనతో జీవించడానికి విలువలను ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో

ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సునీత, ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. నీరజ, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్‌లో సాంకేతిక సదస్సు

విశాలాంధ్ర – గండేపల్లి : ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రగతి అడ్వాన్స్ టెక్నికల్ హబ్ వారి ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సదస్సు "ప్రైడ్స్ 2026 పోస్టర్"ను కళాశాల చైర్మన్ డా పి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సాంకేతిక సదస్సును 2025 జనవరి 7, 8, 9 తేదీలలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో సాంకేతిక సరిహద్దులను అన్వేషించడం ప్రైడ్స్ ముఖ్య ఉద్దేశ్యమని, మన దేశ ప్రగతిని ఇనుమడింపచేయడానికి గౌరవ ప్రధానమంత్రి వర్యులు ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ మరియు ఆత్మ నిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల ప్రాధాన్యతను విద్యార్థులలో పెంపొందింపచేయడానికి, ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సాంకేతిక సదస్సులు ఉపయోగపడతాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని తమ ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని ఇతర విద్యార్థులతో పంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎమ్ సతీష్, డైరెక్టర్–అకడమిక్స్ డా కె సత్య నారాయణ, ప్రిన్సిపాల్ డా జి నరేష్, ప్రైడ్స్ 2026 కన్వీనర్ జి సత్యమోహన్ చౌదరి, ఐటి విభాగాధిపతి, డీన్–కెరీర్ డెవలప్మెంట్ సెల్ డా ఎం రాధికా మణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా వై జయబాబు, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై పోరాటం అవసరం

విశాలాంధ్ర – యు కొత్తపల్లి : ప్రతి ఒక్కరు మాదకద్రవ్యాలపై పోరాటం సాగించాలని. ఏపిఎం కొత్తపల్లి మండలం ఏపిఎం మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం. ఉప్పాడ మత్స్యకార మహిళా సమైక్యలో మాదకద్రవ్యాలు నివారించేందుకు మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేయి చేయి కలుపుదాం మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మిద్దాం అనే నినాదంతో ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపిఎం మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువత పెడదోవ పడుతుందని. ఆయన అన్నారు. మత్తుకు బానిస అవడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలను నిర్మూలిస్తే యువత దేశంలో అగ్రస్థానంలో ఉంటారని ఏపిఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిసి తౌడు, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర – కరప : గ్రామాలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వాకాడ గ్రామంలో తడి పొడి చెత్త సేకరణ ఏ విధంగా అమలు జరుగుతుందో తెలుసుకునేందుకు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యు పిసి కేంద్రాలకు తరలించాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య కార్మికుల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ విలువలు, సమగ్రాభివృద్ధి స్వచ్ఛంద సంస్థ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, విద్యావేత్తల ఆధ్వర్యంలో మానవ విలువలు, సమగ్రాభివృద్ధి లక్ష్యాలుగా "ఫౌండేషన్ ఫర్ హ్యూమన్ వాల్యూస్ అండ్ హోలిస్టిక్ డెవలప్మెంట్" స్వచ్ఛంద సంస్థ ఆగస్టు నెలలో రిజిస్టర్ చేశామని నవంబరు 7వ తేదీన సాయంకాలం 6 గం. స్థానిక రామారావుపేటలో ఎస్టియు విద్యా భవన్‌లో జేఎన్‌టీయు పూర్వపు ఉపకులపతి ఆచార్య ఎన్‌విఎస్ జి మురళి కృష్ణ సంస్థను ప్రారంభిస్తారని సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్దనం, సుబ్బరాజు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర విద్య అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో కామన్వెల్త్ యూనివర్సిటీ, కరేబియన్ ఆచార్యులు కె కృష్ణమోహన్, జేఎన్‌టీయు ఆచార్యులు జి అబ్బయ్య, ఎ కృష్ణ మోహన్, ఆలపాటి శ్రీనివాస్, ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్, ప్రముఖ సైకాలజిస్ట్ డా విజయలక్ష్మి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సమగ్ర విద్య అంశంపై తమ అభిప్రాయాలను వారు కోరారు.

మూడు చక్రాల మోటారు వాహనాల మంజూరుకు దరఖాస్తులు

విశాలాంధ్ర – కాకినాడ : ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి కాకినాడ జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన వారికి నియోజకవర్గానికి 10 చొప్పున మూడు చక్రాల మోటారు వాహనములను మంజూరుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్ ఎవై శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు చక్రాల మోటారు వాహనాల కొరకు అర్హులైన అభ్యర్థులు నేటి నుంచి ఆన్ లైన్ వెబ్ సైట్ www.apdascac.ap.gov.in ద్వారా నవంబర్ 25వ తేదీ లోపు దరఖాస్తులను చేసుకోవాలని ఆయన తెలిపారు.

మూడు చక్రాల మోటారు వాహనాల కొరకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు : అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల పైబడి 45 సంవత్సరాల లోపల ఉండవలెను. సదరమ్ ధృవీకరణ పత్రం ప్రకారం కాళ్ళలో(లోయర్ లింబ్స్) వైకల్యం 70% అంతకంటే ఎక్కువ వైకల్యం శాతం. కుటుంబ వార్షిక ఆదాయం గరిష్టంగా రూ.3,00,000 కంటే ఎక్కువ కాకూడదు. మోటార్ వాహన చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. అభ్యర్థి గతంలో ప్రభుత్వం, ప్రభుత్వ ఏజెన్సీ, ప్రైవేట్ ఏజెన్సీ లేదా ఇతర ఏదైనా రూపము నుండి మోటారైజ్ వాహనం పొంది ఉండకూడదు. అభ్యర్థి పేరు మీద రెండు,మూడు,నాలుగు చక్రాల మోటారైజ్ సొంత వాహనం ఉండకూడదు. సహాయ పరికరం లేకుండా నడవగల వ్యక్తులు అనర్హులు. వేతనం లేదా శాలరీ పొందుతూ వారు కనీసం ఒక సంవత్సరము అనుభవం కలిగి ఉన్నచో సంబంధిత ధృవీకరణ పత్రము జత పరచాలని ఆయన తెలిపారు.

హెచ్చరిక : దళారులు నమ్మకుండా, మోసపోకుండా అత్యంత జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు. గతంలో చేసిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవు (చెల్లవు), ఇప్పుడు క్రొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభావంతులు మరియు వయో వృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు/జిల్లా మేనేజర్ ఎవై శ్రీనివాసు తెలిపారు.

పన్ను చెల్లించని ఖాళీ స్థలాలలో జప్తు బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ నగరంలో అనేక ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఖాళీ స్థలాలలో పన్ను చెల్లించకపోవుట వలన "ఈ ఖాళీ స్థలం జప్తు చేస్తున్నట్లు" బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు నగరంలోని దాదాపు 30 ఖాళీ స్థలాలలో జప్తు బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 25వ తేదీలోపు ఖాళీ స్థలాల యజమానులు తమ పన్నులు చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. లేని పక్షంలో, ఆ తేదీ తర్వాత పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువుల దాణా అందజేత

విశాలాంధ్ర – తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో మొంథా తుఫాన్ కారణంగా పశువులు మేతకు ఇబ్బందికరంగా ఉందని తెలుసుకున్న ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పశుసంవర్ధక శాఖ అధికారులతో సంప్రదించి 25 టన్నులు పిల్లెట్ మేత (రూ.2.75 లక్షలు) పంపించారు. కూటమి నాయకులు తాళ్లరేవు పశువుల ఆసుపత్రిలో ఏడి డాక్టర్ బ్రహ్మా వేద ఆధ్వర్యంలో రైతులకు 50 కేజీల దానా బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి), మండల గంగ సూర్యనారాయణ, వేగేశ్న భాస్కర రాజు, నడింపల్లి వినోద్, వుంగరాల వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ దుర్గాప్రసాద్, సిబ్బంది డాక్టర్ సుధ, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో "నెక్స్ట్ జెన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్రమ్ ఆటోమేషన్ టు ఏఐ"

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ , మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో "నెక్స్ట్ జెన్ మాన్యుఫ్యాక్చరింగ్ : ఫ్రమ్ ఆటోమేషన్ టు ఏఐ" అనే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ప్రారంభమైనట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు ఆధునిక తయారీ రంగంలో జరుగుతున్న సాంకేతిక పరిణామాలను లోతుగా అధ్యయనం చేసే అవకాశాన్ని పొందుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మెకానికల్, ప్రొడక్షన్, మెకాట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఆటోమేషన్, రోబోటిక్స్, సెన్సార్స్, మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాల ప్రాథమిక, అన్వయ పరిజ్ఞానాన్ని పొందవచ్చు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా డా సందీప్ కునార్, డా రాహుల్ భారతి మార్పిమ్, డా యుస్రీ యుసఫ్, డా త్రిబెని రాయ్, డా సుమిత్ కుమార్ పాల్గొన్నారు.

కాకినాడ క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ నగరాన్ని క్లీన్ సిటిగా తీర్చిదిద్దే దిశగా ప్రతి పౌరుడు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జీ కమిషనర్ కెటి సుధా కర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పారిశుద్ధ్య సర్కిల్–1 పరిధిలోని కృష్ణనగర్, వైద్యనగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మస్తార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "కాకినాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకం. ప్రతి ఒక్కరూ చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికే అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గారావు పాల్గొన్నారు.

రాజోలు వైసీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లికి అస్వస్థత



విశాలాంధ్ర – అమలాపురం : మాజీమంత్రి, రాజోలు వైసిపి ఇన్ఛార్జి గొల్లపల్లి సూర్యారావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం శివకోటి గ్రామంలో కార్యకర్తలతో మాట్లాడుతుండగా ఒక ఒక్కసారిగా సూర్యారావు కూర్చుండి పోయారు. ఇది గమనించిన కార్యకర్తలు హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సూర్యారావు అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం తెలియడంతో అమలాపురంలో ఉన్న వైసిపి ఇన్ఛార్జ్ పినిపే శ్రీకాంత్ కిమ్స్ వైద్యులను అప్రమత్తం చేశారు. సుప్రసిద్ధ గుండె వైద్యులు డాక్టర్ అభిషేక్ వర్మ ఆధ్వర్యంలోని వైద్య బృందం గొల్లపల్లి సూర్యారావు వైద్య పరీక్షలు నిర్వహించి హార్ట్‌లో రెండు క్లాట్స్ గుర్తించి వాటిని తొలగించి స్టంట్లు వేశారు. ప్రస్తుతం వైద్యుల పరిరక్షణలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావును కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణరావు, అమలాపురం వైకాపా ఇంచార్జ్ పినిపే శ్రీకాంత్, ఏపీయుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు ఎంఎన్‌వి ప్రసాద్ తదితరులు పరామర్శించారు.

పాస్‌పోర్ట్ పోయినది

కవల వంశీకృష్ణ, S/o. త్రిమూర్తులు కొత్తపేట మండలం బిళ్ళకుర్రు శివారు నక్కావారిపేటకు చెందిన నాకు ఎస్ 8825662 అనే నెంబర్తో పాస్‌పోర్ట్ కలదు. నేను దానిని విశాఖపట్నంలో 26-02-2019లో తీసుకుని ఉన్నాను. దాని చెల్లుబాటు తేదీ: 25-02-2029 వరకు ఉన్నది. అయితే నేను బిళ్ళకుర్రు నుంచి కొత్తపేట బైక్‌పై పాస్‌పోర్ట్, సంబంధిత పత్రాలు బ్యాగ్‌లో పెట్టుకుని వస్తుండగా మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయినది దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌ను సంప్రదించగలరు.

కవల వంశీకృష్ణ
డోర్ నెంబర్ 6-106, నక్కావారిపేట,
బిళ్ళకుర్రు, కొత్తపేట మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్
కోనసీమ జిల్లా – 533228.
సెల్: 7815817061

హెల్మెట్ వాడకం పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - మామిడికుదురు : దీప్తి విద్యా సంస్థల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు కొమరాడ, మాకనపాలెం గ్రామాలలో రోడ్ సేఫ్టీ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందుటకు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రెండు గ్రామాలలోనూ విద్యార్థులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. వేగం వద్దు...ప్రాణం ముద్దు అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఏ ఈశ్వరరావు, పీ సుబ్బారావు, వి నాగరాజు, వి కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు యస్ నాగమణి, డి సురేష్ మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలమూరులో పోలీసు పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - ఆలమూరు : పోలీస్ శాఖకు సంబంధించిన ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంక్ ఆలమూరుకు మంజూరైంది. ప్రస్తుత పోలీసు స్టేషను సమీపంలో పోలీస్ శాఖకు చెందిన పాడైపో యిన పోలీసు క్వార్టర్స్ వద్ద ఈ బంకును ఏర్పాటు చేస్తున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి పోలీస్ శాఖ ఏఆర్ డిఎస్పి సుబ్బరాజు, రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యా సాగర్, ఆలమూరు ఎస్సై జి నరేష్, ఇండియన్ ఆయిల్ కంపెనీ ప్రతి నిధులు స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు వంటి నగర పరిధి లోనే ఈ పోలీసు వారి పెట్రోల్ బంకులు ఉన్నాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తొలి బంక్‌ను జిల్లా ఆల మూరులో ఏర్పాటు చేయడం వినియోగదారులకు ఆనందోత్సవం కలిగి స్తుంది. ఎందుకంటే ఎలాంటి కల్తీ లేకుండా నాణ్యమైన కొలతలతో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుగుతాయి. అందుకనే జొన్నాడ-మండపేట రోడ్లో ఈ పెట్రోల్ బంకు వస్తుందని వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నవ జనార్ధన స్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు దంపతులు

విశాలాంధ్ర - ఆలమూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత నవ జనార్ధన స్వామి ఆలయానికి అయినవిల్లి అప్పనపల్లి ఆలయాల దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు హైమా పార్వతి దంపతులు బుధవారం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి పర్వదిన సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు దంపతులు దర్శనానికి రావడంతో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్ ఆచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో సత్యనారాయణ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, బొబ్బా రాంబాబు, చిన్నం సుబ్బలక్ష్మి, డి విజయలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, తారా దుర్గ భవాని, కట్ట శ్రీనివాస్, కొప్పాడి జై బాబు, సబ్బవరపు రావమ్మా, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - మండపేట : మండలంలోని ఏడిద పరిసర ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కే రత్నాలరావు తెలిపారు. సబ్ స్టేషన్లో ఆర్ డీ ఎస్ ఎస్ పనుల్లో భాగంగా 11 కేవీ కొత్త ఫీడర్ల ఏర్పాటు ఇతర మరమ్మతు పనుల కోసం ఈ సరఫరా నిలిపి వేస్తున్నామని చెప్పారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఏడిద సీతానగరం, సావరం, కొత్తూరు గ్రామాలకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆటంకం ఏర్పడు తుందని అనంతరం యధావిధిగా సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సిఎస్సి కేంద్రాల్లో ఈ స్టాంపు స్టేషనరీ కొరత

-ప్రజలకు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర - కాట్రేనికోన : సురక్షితంగా సౌకర్యంగా ఉండే ఈ స్టాంప్ విధానాన్ని సిఎస్సి సెంటర్స్ ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అమలు చేస్తున్నారు. అయితే గ్రామాల్లో ఉన్న సిఎస్సి సెంటర్లకు ఈ స్టాంపులు స్టేషనరీ కొరత పట్టి పీడిస్తోంది. గతంలో స్టాంపుల కోసం దూరంగా ఉన్న నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లి అనేక వ్యయ ప్రయాసలు పడేవారు. సిఎస్సీ కేంద్రాల్లో ఈ స్టాంపులు పుణ్యమా అంటూ రిజిస్టర్ కార్యాలయాలు వద్ద పడిగాపులు తప్పాయి. అయితే సిఎస్సి కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో ఈ స్టాంపులు అందకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ స్టాంపులు జారీ అవ్వాలంటే సరిపడ ఈ స్టాంపు స్టేషనరీ అవసరం ఉంటుంది. అయితే మండల కేంద్రాల్లోని సిఎస్సి కేంద్రాలకు ఈ స్టాప్ స్టేషనరీను సిఎస్సి అధికారులు మొక్కుబడిగా సరఫరా చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సముద్ర శివారున కాట్రేనికోనలో ఉన్న సిఎస్సి కేంద్రానికి సరిపడా ఈ స్టాంప్ స్టేషనరీను అందించకపోవడంతో ప్రజల అవసరాలు తీరడం లేదు. ఇక్కడ కనీసం నెలకు 2000 వరకు ఈ స్టాంపు స్టేషనరీ అవసరం ఉండగా 200లోపే అందజేస్తున్నారు. దీంతో ఈ స్టాంపులు కొరకు ప్రజలకు పాట్లు తప్పడం లేదు. పది రూపాయలు ఈ స్టాంపు కొరకు వందరూపాయల ఖర్చు పెట్టుకుని ముమ్మిడివరం లేదా అమలాపురం వెళ్లాల్సి వస్తోంది. సొమ్ము కాలం వృధా అయి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు తదితర అన్ని వర్గాలకు ప్రతి పనికి అవసరమైన స్టాంపులు దొరకక తాహి సిల్దార్ కార్యాలయం, బ్యాంకులు, రిజిస్ట్రేషన్ ఆఫీసులో పనులు నిలిచిపోతున్నాయి.

ప్రస్తుతం భూమి రిజిస్ట్రేషన్లకు కూడా ఈ స్టాంపులనే వాడుతుం దున రిజిస్ట్రేషన్‌లకు జాప్యం జరుగుతోంది. ఈ స్టాంపుల కొరతతో దూర ప్రాంతాలకు వెళుతూ బ్లాక్లో అధిక ధరలకు కొనుక్కోవాల్సి వస్తుందని అని మండల ప్రజలు వాపోతున్నారు. ఇక నైనా జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో ఈ స్టాంపు స్టేషనరీ సరఫరా చేసి అసౌకర్యం తొలగించాలని కాట్రేనికోన మండల ప్రజలు కోరుతున్నారు.

తీర ప్రాంత ప్రజలకు సక్రమంగా తాగునీరు అందివ్వాలి

విశాలాంధ్ర - యానాం : యానాం కేంద్ర పాలిత ప్రాంతం శివారు సావిత్రి నగర్ గడుస్తున్న గత ఏడు నెలలుగా సక్రమంగా తీర ప్రాంత ప్రజలకు త్రాగునీరు అందడం లేదని యానాం ప్రజానాయకుడు తోటరాజు పిడబ్ల్యుడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తున్న కూడా ఎంతోమంది దాతల సహకారంతో మంచినీటి సరఫరా అందిస్తున్నామని, దీనికి పూర్తి బాధ్యత సంబంధిత పిడబ్ల్యుడి అధికారులు నిర్లక్ష్యం వల్లే తీరప్రాంత ప్రజలకు నీరు అందడం లేదని తోటరాజు అన్నారు. ఒకే పైపులైన్ 36 ప్యాలీలు వేయడం ఏమిటని సంబంధిత అధికారులను తోటరాజు నిలదీ శారు. అంతేకాకుండా డ్రైనేజి వ్యవస్థ అస్తవ్య స్తంగా ఉందని ఎక్కడికక్కడే నీరు నిలువ ఉండి ఎటూ వెళ్లకుండా అక్కడే నీరు నిలబడిపోతుందని తక్షణమే డ్రైనేజీలను బాగు చేయాలన్నారు. దీనిపై గత ప్రాంతీయ పరిపాలనకు వినతి పత్రం కూడా అందించామన్నారు. స్పందించిన పిడబ్ల్యుడి అధికారులు మరో నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని అధికారులు సమాధానం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కర్రీ పేర్రాజు, రామకృష్ణ, పిసింగి బాబి మున్న, పోతుల శివకృష్ణ, బిక్కు కృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కాకినాడ : సీజనల్ వ్యాధులపై గ్రామాలలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిం చాలని అలాగే ప్రభుత్వ నిర్వ హించే వైద్య ఆరోగ్య కార్యకలా పాలలో ప్రతి గ్రామీణ వైద్యుడు పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఎస్విఎన్ గ్రాండ్ హోటల్‌లో అలెంబిక్ కంపెనీ ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ప్రసం గించారు. రూరల్ మెడికల్ ప్రాక్టీస్ సొసైటీ కార్య దర్శి శోభన్ బాబు, కోశాధికారి దంగేటి వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో పలువురు గ్రామీణ వైద్యులు పాల్గొ న్నారు. మాన్యశ్రీ మన ప్రియతమ ముఖ్య మంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, అలాగే ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో కష్టపడి మనకి అనేక పరిశ్రమలు తీసుకువస్తున్నారని, అలాగే మెడికల్ కాలేజీలు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్లో ఏర్పాటు చేయడం చాలా ఆనందదా యకమని, ఆ విధం గా చేస్తే త్వరగానే మనకి కాలేజీలు పూర్తవుతాయని, జగన్ గవర్నమెంట్లో పేరుకి కాలేజీలు స్థాపించామని చెప్పడమే గాని ఎక్కడ అమలులోకి రాలేదని, ఏదైనా సుమారు 28 మెడికల్ కాలేజీలు సంస్థలు అయితేనే మన తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీ రామారావు అలాగే చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మాత్రమే ఇవన్నీ ప్రారంభించడం జరిగిందని తెలియ జేశారు. అలాగే ఎంబిబిఎస్ సీట్లు కూడా త్వరలో పెరుగుతాయని గ్రామీణ వైద్యులు వారి పరిధి దాటి వైద్యం చేయరాదని, డాక్టర్ చప్పిడి తెలియ జేశారు. కార్యక్రమంలో సుధాకర్ శ్రీనివాస్, సత్య నారాయణ, లలిత కుమారి, సుజాత కమల శ్రీనివాస్, కెవివి సత్య నారాయణ, గ్రామీణ వైద్యులు పాల్గొని జయప్రదం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - మండపేట : మండలంలోని ఏడిద పరిసర ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కే రత్నాలరావు తెలిపారు. సబ్ స్టేషన్లో ఆర్ డీ ఎస్ ఎస్ పనుల్లో భాగంగా 11 కేవీ కొత్త ఫీడర్ల ఏర్పాటు ఇతర మరమ్మతు పనుల కోసం ఈ సరఫరా నిలిపి వేస్తున్నామని చెప్పారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఏడిద సీతానగరం, సావరం, కొత్తూరు గ్రామాలకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆటంకం ఏర్పడుతుందని అనంతరం యధావిధిగా సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. వినియోగదారులు, సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి కాట్రేనికోన విద్యార్థి

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన గ్రామ విద్యార్థి విత్త నాల కుశాల్ నాగ వెం కట్ (8) ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కి రికార్డు సృష్టించాడు. అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్న వెంకట్ ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ చిన్నారి 195 దేశాల పేర్లు వాటి రాజధానుల పేర్లు కేవలం 2 నిమి షాల 59 సెకన్ల 11 మిల్లీ సెకన్ల కాల వ్యవధిలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో అవార్డు సంపాదించా దన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ విద్యార్థి, విద్యన భ్యసించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు సమక్షంలో అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి షేక్ సలీం భాష, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరగతి సంచాలకులు సంధ్యాల మను విహర్, పాఠశాల కోఆర్డినేటర్ వర్ధిని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం చిన్నారి విత్తనాల కుశాల్ నాగ వెంకట్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు చేజిక్కించుకొని జిల్లాకు రాష్ట్రానికి ఆ ప్పై దేశానికి మంచి పేరు ప్రఖ్యా తులు తీసుకురావాలని ఆ చిన్నారిని ఆశీర్వదించారు.

వేధింపులపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - అమలాపురం : గోడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికలు, బాలుర గురుకుల హాస్టళ్లను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పుణ్యమంతుల రజిని, వెంట్రుసుధీర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ అభం, శుభం తెలియని చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు రోజురోజుకీ పెరుగుతుండడం తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఎన్ని చట్టాలు చేసినా..ఎన్ని ప్రచా రాలు చేసినా ఈ దారుణాలకు అడ్డుకట్ట పడటం లేదని మనిషి రూపంలో ఉన్న మృగాళ్ల అమాయక పిల్లల భవిష్యత్తును చిదిమేస్తున్నారని అలాంటి మృగాల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఇటీవల తునిలో ఒక వృద్ధుడు బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఇదే తరహా సంఘటనలు అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనూ చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని విద్యార్థినీలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం పరిచయస్తులు, బంధువులే ఉండటం అత్యంత భయంకరమైన అంశం అని, ఈ తరహా ఘటనలను నివారించాలంటే కేవలం చట్టాలు కాకుండా సామాజిక అవగాహన అవసరం అని అవగాహన కల్పించారు.

కారాగారాలను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి

విశాలాంధ్ర - రాజ మహేంద్రవరం : రాజ మహేంద్రవరం కేంద్ర కారాగారం ప్రత్యేక మహిళా కారాగారాలను తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్రీలక్ష్మి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలకు అందిస్తున్న ఆహార ప్రమాణాలు, నివాస సదుపాయాలు, వైద్య సేవలను సమీక్షించారు. ఖైదీలతో మాట్లాడి వారి న్యాయ అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కావాలనుకునే ఖైదీలు లేదా వారి కుటుంబ సభ్యులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, బెయిల్ పిటిషన్లు, అప్పీలు లేదా ఇతర న్యాయ వ్యవహారాల్లో అవసరమైన సహాయం అందించడానికి సంస్థ సిద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు పారా లీగల్ వాలంటీర్ల ద్వారా అర్జీలు సమర్పించుకోవచ్చని, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పార్కుల కూలీల జీతాల బిల్లులను మంజూరు చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘం పార్కు కూలీల గౌరవ అధ్యక్షుడైన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ బుధవారం కుళాయి చెరువు పార్క్‌లో ఉన్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీ నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కుళాయి చెరువు పార్కు, గాంధీనగర్ పార్కులో పనిచేస్తున్న పార్కు కూలీలు శానిటేషన్, మొక్కలను ట్రిమ్మింగ్ చేసే కార్మికులు, సెక్యూరిటీ గార్డ్స్‌కు రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని కార్మికులకు సకాలంలో జీతాలు మంజూరు కాక ఆర్థిక ఇబ్బందులతో శతమాతమవుతున్నారని అప్పుల ఉచ్చులో కోరుకునే పరిస్థితి శ్రీలక్ష్మీ గణపతి ఏజెన్సీ కాంట్రాక్టర్ తీసుకొస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త కాంట్రాక్టర్ కార్మికులకు కనీసం పనిముట్లు, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో విఫలం అయ్యారని ఆయన అన్నారు. కార్మికుల జీతాల విషయమై కాంట్రాక్టర్ సంప్రదించగా బిల్లులు మంజూరు కావడం లేదని కుంటి సాకులు చెబుతున్నారని, పార్కు కూలీల బిల్లులు పెండింగ్‌లో ఉంటే కాకినాడ స్మార్ట్ సిటీ ఈఈ తక్షణమే స్పందించి పార్కు కూలీల బిల్లును సెలక్షన్ చేసి బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, పార్కులను ప్రైవేటీకరణ చేసిన, ప్రైవేటు వ్యక్తులుగా అప్పగించిన సహించేది లేదని, ప్రజా ఉద్యమాలు చేపడుతామని, ప్రజలు ఆహ్లాదకరంగా ఉండే పబ్లిక్ పార్కులను ప్రభుత్వంలోనే కొనసాగించాలని, పార్కుల అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు కేటాయించాలని, పార్కు కూలీలకు ఈఎస్ఐ వర్తించకపోతే దఫదఫాల ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. అనంతరం ఈఈకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అప్పల నర్సమ్మ, సత్య, రాజ్యలక్ష్మి, కనకం, ఎస్‌కే బేబీ, బి దేవి సెక్యూరిటీ గార్డులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలను ఉపేక్షించం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, డెకాయ్ ఆపరేషన్లను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మంది రంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నివారణ చట్టం అమలుపై సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగరిక సమాజంలో ఆడ, మగ తారతమ్యం లేదని అన్నారు. పురుషుల కంటే దీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. అనాగరికమైన గర్భస్థ శిశు లింగ నిర్ధా రణ పరీక్షలు చేసినా చేయించుకున్న ఉపేక్షించేది లేదన్నారు. ఇటువంటి పరీక్షలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా రెండు, మూడు కాన్పుల మహిళల లక్ష్యంగా డెకాయ్ ఆపరేష న్లను నిర్వహించాలన్నారు. జూలై,2025 నుండి అక్టోబర్, 2025 వరకు స్కానింగ్ సెంటర్స్ 178 సాధారణ తనిఖీలను నిర్వహించినట్టు తెలిపారు. భీమవరంలో డివిజన్లో 81, నరసాపురం డివిజన్లో 80 మొత్తం జిల్లాలో 161 స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.గీతా బాయి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.వి.ఎస్. బద్రీరాజ్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ వి.ఎస్.ఆర్.కె.కుమారి, హెల్త్ సూపర్వైజర్ ఏ.జే.సంధాని పాల్గొన్నారు.

హాకీ శత జయంతి ఉత్సవాలు

గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : హాకీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన గోడ పత్రికను బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా వి సతీష్, హాకీ ఆంధ్ర ప్రదేశ్ కాకినాడ జిల్లా జాయింట్ సెక్రెటరీ వి రవిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. హాకీ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా దేశం నలుమూలల ప్రతి జిల్లాలో నవంబర్ 7వ తేదీన ఒక మెన్ హాకీ మ్యాచ్, ఒక ఉమెన్ ఓకే మ్యాచ్ జరిగే విధంగా హాకీ ఇండియా అన్ని రాష్ట్రాల హాకీ సంఘాలకు నిర్దేశించిందని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా వి సతీష్, హాకీ ఆంధ్ర ప్రదేశ్ జాయింట్ సెక్రెటరీ రవి రాజు తెలిపారు. దానిలో భాగంగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో హాకీ మ్యాచులు జరుగుతాయన్నారు. దానిలో భాగంగా కాకినాడ జిల్లాలో జిల్లా క్రీడా మండల మైదానం, కాకినాడలో ఉన్న ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో ఈ నెల 7న ఉదయం ఏడు గంటలకు సీనియర్ మహిళలు పురుషుల హాకీ పోటీలు ప్రారంభమవుతాయని, ఏడో తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఫ్లడ్ లైట్స్‌లో సీనియర్ హాకీ క్రీడాకారులు మరియు సూపర్ సీనియర్ హాకీ క్రీడాకారులుతో కలిపి ఒక మ్యాచ్ జరుగుతుందన్నారు. కావున సీనియర్ హాకీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, హాకీ కుటుంబ సభ్యులు అందరూ ఉదయం సాయంత్రం కూడా హాకీ 100 సంవత్సరాల ఉత్సవాల్లో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

రాయపు రెడ్డి బాబీని కఠినంగా శిక్షించాలి

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ఐ పోలవరం మండలంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారానికి నిరసనగా, బాలికల రక్షణపై అవగాహన కల్పించడానికి, బుధవారం ముమ్మిడివరం గర్ల్స్ హైస్కూల్ వద్ద అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో విద్యార్థినులకు బాలికల భద్రత, లైంగిక వేధింపుల నుంచి తమను తాము రక్షించుకోవడం, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం, బాలికపై జరిగిన దారుణాన్ని ఖండిస్తూ, నిందితుడు రాయపరెడ్డి బాబీని కఠిన శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సంద ర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి దైవ కృప, జిల్లా కమిటీ సభ్యురాలు గుత్తుల హైమావతి, పి అమూల్య మాట్లాడుతూ, బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులకు తక్షణమే, కఠి నంగా శిక్ష విధించాలని, అలాగే పాఠశాలలు, కళాశాలల్లో బాలికల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అవగాహన, నిరసన కార్యక్రమంలో విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని, నినాదాలు చేశారు. ఆడపిల్లల భద్రతకు కట్టుబడి ఉండాలని వారు తమ నిరసన ద్వారా తెలియజేశారనీ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దైవ కృప తెలిపారు.

వీఆర్ఓ కుమారుడు వల్లే నష్టపోయాం

వెలువలపల్లి 'మొంథా' బాధిత నిరుపేదల ఆవేదన

విశాలాంధ్ర - అమలాపురం : వీఆర్ఓ కుమారుడి నిర్లక్ష్య వైఖరి వల్లే నష్టపోయామని మండలం లోని వెలువలపల్లి గ్రామానికి చెందిన 'మొంథా' నిరుపేద బాధి తులు ఆవేదన వ్యక్తం చేశారు. 'మొంథా' తుఫాను కారణంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన నష్టపరిహారం అందకుండా పోవటానికి అతనే కారకుడు అయ్యాడని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక సచివాలయం వద్ద ఉన్న వీఆర్ఓ వద్దకు అధిక సంఖ్యలో బాధితులు వెళ్ళి తమ పేర్లు రాయక పోవడానికి కారణం ఏంటని అడిగారు. సుమారు 50 బాధిత కుటుంబాలకు మీవల్ల, మీ కుమారుడి వల్ల అన్యాయం జరిగిందని ఆరోపించారు. నా ఆరోగ్యం బాగాలేని కారణంగా నా కుమారుడితో జాబితా తయారు చేయించానని వీఆర్ఓ ఇచ్చిన వివరణతో బాధితులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. మీ ఆరోగ్యం బాగోకపోతే మరొక వీఆర్ఓతో ఆ పని చేయించాలి కానీ నిబంధనలకు విరుద్ధంగా మీ అబ్బాయిని ఈ పనికి ఎవరు అనుమతించారని వారు ప్రశ్నించారు. స్థానిక తహశీల్దార్‌కి నా బాధ చెప్పుకున్నానని ఆయన ఒప్పుకున్నాకే మా అబ్బాయితో నా పని చేయిం చుకున్నానని వివరణ ఇచ్చారు. జరిగిన పొరపాటుకు తనను మన్నించాలని వీఆర్ఓ బాధితులను కోరారు. మిమ్మల్ని మన్నిస్తాం మాకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని బాధితులు వీఆర్ఓను ప్రశ్నించారు. అందే సత్య నారాయణ, నిల్ల సూరిబాబు, మేడి శెట్టి నాగబాబు, బొంతు శ్రీనివాస్, దోని పాటి సత్య ప్రసాద్, ముత్యాల భాగ్యలక్ష్మి, నుకపెయ్యి సరస్వతి, మోత వెంకటేశ్వరరావు, చల్లాబత్తుల విష్ణుప్రసాద్, ఐదుగు రామలక్ష్మి, మోత జనార్ధనరావు, చల్లాబత్తుల నాగేశ్వరరావు, రావి శేషారావు, చల్లాబత్తుల హరికృష్ణ, తాళ్ళ లక్ష్మీ, చల్లాబత్తుల సునీల్, బాల గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో ఐదుగురు నిందితులు అరెస్ట్ : ఎస్పీ

- 65 గ్రాములు బంగారు ఆభరణాలు స్వాధీనం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 6.50 లక్షల రూపాయలు విలువ కలిగిన 65 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు ద్విచక్ర వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావుతో కలిసి ఎస్పీ కిషోర్ వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం కోళ్ళపర్రు గ్రామానికి చెందిన తాటిపర్తి రాముడు, నక్క వెంకటేష్, తాటిపర్తి దుర్గారావు, పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం అత్తమూరు గ్రామానికి చెందిన గండికోట నాగరాజు, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం ఎర్రనేలకుంట గ్రామానికి చెందిన ఆసెట్టి నగేష్ లు చెడు వ్యసనాలకు బానిస అయ్యారు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో తప్పుడు మార్గాన్ని ఎంచుకొని దొంగతనాలు చేయడం అలవాటు పడ్డారు. ఇందులో భాగంగానే డబ్బు కోసం చేబ్రోలు, నిడమర్రు, గణపవరం, భీమడోలు, తణుకు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలలో చైన్ స్నాచింగ్, మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతూ వున్నారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా పోలీస్ స్టేషన్లో చోరీ కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు సీఐ రజినీ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్, నిడమర్రు ఎస్ఐ ఎన్వీవి.రమేష్ , గణపవరం ఎస్ఐ ఏ.మణి కుమార్, భీమడోలు ఎస్సై ఎస్కే.మదీనా భాష, వారి సిబ్బంది కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బుధవారం ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామ శివారులోని మురుక్కాదు వంతెన వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 65 గ్రాముల బంగారు ఆభరణాలు నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో మార్కెట్లో 10 లక్షలు ఉంటుందని వివరించారు. అంతేకాకుండా నిందితులు ఆకివీడు పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకులో మరో 38.8 గ్రాముల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించినట్లు వెల్లడించారు. వాటిని కూడా త్వరలో స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ముద్దాయిలపై గతంలో తాడేపల్లిగూడెం, ఐరగవరం, తణుకు రూరల్, గణపవరం, చేబ్రోలు, భీమడోలు, నిడమర్రు పోలీస్ స్టేషన్లో అనేక కేసులు నమోదై ఉన్నాయని ఎస్పి వివరించారు. కేసును ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసినందుకుగాను ఎస్పీ కిషోర్ పోలీసులను అభినందించారు.

కేవీకే దుర్గారావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కె.వి.కె దుర్గారావు జన్మదిన వేడుకలు బుధవారం అంగరంగ వైభవముగా జరిగింది దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అభిమానుల దమధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు అంతకుముందు ఎంపీపీ కేవీకే దుర్గారావు దేవరపల్లి లో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు జరిపి దేవదర్శనం చేసుకున్నారు కేసువా చార్యులు దుర్గాప్రసాద్ ఆచార్యులు ఎంపీపీ కేవీకి దుర్గారావు ను ఆశీర్వ దించారు ఎంపీడీవో సిహెచ్ నాగార్జున రావు పిఓపిఆర్డి వై రాజారావు సూప రిండెంట్ జి శాంతి సీనియర్ అసిస్టెంట్ సిహెచ్ కుసుమ జూనియర్ అసిస్టెంట్ తనుజ కార్యాలయ సిబ్బంది కెవికె దుర్గారావుకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు ఎంపీపీ కేవీకే దుర్గారావుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ మాజీ ఏఎంసి చైర్మన్ గన్నమనే జనార్ధన రావు పచ్చ రాంగోపాల్ దుగ్గిన గంగాధరరావు చీకట్ల వీర వెంకటరావు సిద్దా సూర్యారావు కడిమి రాజు కామిశెట్టి దుర్గారావు,వైస్ ఎంపీపీ సాది సుబ్బారావు, కవల శ్రీనివాస్ వెలగా శ్రీనివాస్ దోనెల్లి జానకిరామ్ గడ రాంబాబు గడ జగదీష్ కుసులూరి వెంకట సతీష్ఆచంట అనసూయ సురేష్ అనసూయఎంపీటీసీలు సర్పంచులు అధికారులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పిహెచ్ స్కూల్ నందు జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో వివిధ పాఠశాలలకు చెందిన పలు టీంలు పాల్గొనగా దేవరపల్లి భాష్యంస్కూల్ కి చెందిన రెండు టీంలు మొదటి మరియు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మొదటి స్థానం సాధించి జిల్లాస్థాయి చెకు ముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులు పి శరణ్య,పి మహాలక్ష్మి,జె మనస్వి, మూడో స్థానం సాధించిన జి సూర్యశివ సీతారాం,డి సేహిత్ రెడ్డి,కే స్వరని లను భాష్యం స్కూల్ జోనల్ ఇన్చార్జ్ వి ఆంజనేయులు,ప్రిన్సిపల్ పి పెరయ్య నాయుడు,చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా,ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజ మండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో నవంబర్ 7వ తేదీ (శుక్రవారం) ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్ చంద్ర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో బ్యాంక్ అఫ్ బరోడా, ఆంధ్రా మీడియా, ఎస్ బి ఐ పేమెంట్స్, క్రెడిట్ కార్డ్స్ భరత్ పే సంస్థలలోని పలు ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించబ డనున్నాయని ఆయన తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ పూర్తిచేసిన, అను భవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల అభ్య ర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్ తెలిపారు.

పర్యాటకాభివృద్ధి కోసం ప్రతిపాదనలు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి జిల్లా పర్యాటక శాఖ ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తోందని జిల్లా పర్యాటక అధికారి పి. వెంకట చలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక ప్రోత్సాహం కోసం జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్ల వంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు, వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చనీ వెంకటాచలం తెలిపారు. ఈ కార్యకలాపాలు రాజమహేంద్ర వరం గోదావరి పరిసర ప్రాంతాలు, కోవూరు వైపు, ధవళేశ్వరం-వేమగిరి మార్గం, అలాగే నిడదవోలు కాలువ ప్రాంతంలో చేపట్టేందుకు ప్రతిపాదనలు స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలను ఴఴ్.శీబతీఅంఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్సైట్లో చూడవచ్చని, అలాగే 9505011951 / 6309942025 నంబర్లలో సంప్రదించవచ్చనీ తెలిపారు.

మౌలిక సదుపాయాలు, బోధన పద్ధతుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : విద్యార్థులలో అభ్యాస సామర్థ్యాలు గుర్తించి పెంపొందించేలా ఉపాధ్యా యులు, అధికారులు కృషి చేయాలని, అదే విధంగా పెండింగ్ లో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం బొమ్మూరు కలెక్టరేట్లో పాఠశాల విద్య, ఇంటర్, వొకేషనల్, ఎస్ ఎస్ ఏ విద్య బోధన, మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, ఐ సి డి ఎస్ కి చెందిన అంగన్వాడి కేంద్రాల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంచేలా చదవడం, రాయడం సరిగా రాని విద్యా ర్థులకు 'విద్యా శక్తి' కార్యక్రమం కింద సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన చేయాలని, అందుకు అనుసరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకోవాలని, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ ద్వారా పాఠశాలకు రాని మైగ్రెంట్ పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. జిల్లాలో 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో ఇంకా సుమారు 6,000 మంది విద్యార్థులకు అపార్ ఐడీ లేదని, తప్పనిసరిగా వారందరికీ ఐడీలు తక్షణం సృష్టిం చాలని కలెక్టర్ ఆదేశించారు. తల్లికి వందనం పథకం కింద సాంకేతిక కారణాల వలన నిధులు జమ కాక పోయిన లబ్ధిదారుల జాబితాను గ్రామ/ వార్డు సచివాలయాలతో సమన్వయం చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి నుండి ఐఐటీ శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. అవసరమైన పాఠశాల భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మౌలిక సదుపా యాలు, మరమ్మత్తులు, స్కూల్ గ్రాంట్స్ వినియోగం సక్రమంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే ప్రతిభావంతులైన విద్యార్థు లను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహకాలు అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులలో మానసిక వత్తిడి, అనవసర ఆందోళన, తగ్గించేంద ుకు కౌన్సిలర్స్ (15 మంది) నీ నియామకం చేయడం జరిగిందనీ అధికారులు తెలియ చేశారు. వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్ లో మెరుగైన ఫలితాలు సాధించే క్రమంలో వొకేషనల్ టీచర్స్ (69 మంది) నియామకాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మరో 6 పాఠశాలల కోసం రూ.3.45 కోట్ల గ్రాంట్ విడుదల చేసినట్లు అధికారులు తెలియ చేశారు. అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న వాటిని సమీప ప్రభుత్వ పాఠశాలలతో విలీనం చేసే విధానం లో మార్గదర్శకాలు అనుసరించి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలనీ ఐసీడీఎస్ అధికారికి కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సుభాషిణి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి, జిల్లా ఇంటర్మీడియట్/వొకేషనల్ అధికారి ఎన్.ఎస్.వి.ఎల్. నరసింహం, ఇతర విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

14న గోదావరి హారతి

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

విశాలాంధ్ర - కొవ్వూరు : గోష్పాద క్షేత్రంలో నవంబర్ 14 న గోదావరి హారతి వైభవోపేతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. బుధ వారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో గోదావరి హారతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ అక్టోబర్ 27వ తేదీ కార్తీక సోమవారం గోదావరి హారతి చేపట్ట వలసి ఉందని అయితే మొంథా తుఫాన్ వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. నవంబర్ 14వ తేదీ శుక్రవారం గోదావరి హారతి నిర్వ హించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోదావరి హారతికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేసే విధంగా అధికారులను ఆదేశించామని తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులను, మెడికల్ క్యాంప్ లో మెడికల్ ఆఫీ సర్ ఏర్పాటు చేయాలని, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వారికి సూచనలు చెయ్యడం జరిగింది. పంట్లులను ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకి, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి, 15 బోట్లు ఏర్పాటుచేసి, వారినీ గుర్తించే క్రమంలో టీ షర్ట్ లు ధరింప చేయాలని మ త్స్యశాఖ అధికారులకు సూచనలు చేయడం జరిగింది. గోదావరి హారతి కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు ఉన్నతా ధికారులు గోదావరి హారతి కి హాజరయ్యే క్రమంలో అధికారులందరూ సహక రించి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి జి. దేవకుమార్, ఏడి, మత్స్య శాఖ, ఎస్.కె. దిల్షద్, తహసిల్దార్ ఎమ్ దుర్గా ప్రసాద్, ఇరిగేషన్ శాఖ ఎ. ఈ. మణికంఠ, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రతిని ధులు పంపన త్రిమూర్తులు, కలగర శ్రీనివాసు, తదితరులు పాల్గొ న్నారు.

వేగేశ్వరపురం ఘనంగా వేంకటేశ్వరుని తిరునాళ్లు



విశాలాంధ్ర - తాళ్లపూడి : కార్తీక పౌర్ణమి సందర్బం గా తాళ్లపూడి మండలం లోని గోధావరి నది తీరం లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మండలం లోని పలు ఆలయాలు భక్తులతో నిండాయి. ఆలయ ప్రాంగణం అంతా విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. వేగేశ్వరరపురం లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కైగాల వంశీకులు అద్వర్యం లో చేపట్టిన తిరుణాళ్ళు సందర్భన్గా ఆలయం వద్ద భక్తులు సందడి నెలకొంది. ధ్వజస్తంభం వద్ద మహిళలు పూజలు చేశారు. ఈ తిరుణాళ్ళలో చుట్టూ ప్రక్కల నుండి వివిధ రకాల వచ్చి అంగళ్ళు, తినుబండారాలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. చుట్టు పక్కల గ్రామాల నుండి వేలాది మంది వస్తారని అంచనా. ఆలయం వద్ద రద్దీ లో ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలీస్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. యాభై మంది స్పెషల్ ఫోర్స్ హాజరయ్యారు.

ఆదిత్యలో కార్తీక పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్యాత్మిక ప్రాంగణంలో ఉదయం 6-00 గంటల నుండి విశేష పూజలతో ఆధ్యాత్మిక శోభ సంతరించు కుంది. కార్తీక మాసం అందునా కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా సరస్వతి అమ్మవారికి విశేష అభిషేకం, రుద్రాభిషేకం, విశేష పూజలు, నీరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాలతో ఆదిత్య ప్రాంగణం వేద ఘోషతో మర్మోగినది. ఈ కార్యక్ర మంలో ఆదిత్య అధినేతలు డా నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతలు, డా ఎన్ సతీష్ రెడ్డి, శృతి రెడ్డి దంపతులు ఆదిత్య కుటుంబ సభ్యులు బంధు మిత్రులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం 7:00 గంటల నుండి పుష్పార్చన, జ్యోతిర్లింగార్చన, నీరాజనం, మంత్రపుష్పం ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీరామ్ శర్మ, ప్రసాద్ ఆచార్యులు పూజా విధులు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



విశాలాంధ్ర - పి గన్నవరం : కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం పి గన్నవరం మండలంలోని శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలా డాయి. పి గన్నవరం గ్రామంలోని బాలా త్రిపురసుందరి గరుడేశ్వర స్వామి వారి ఆల యంలో వేకువ జాము నుండే భక్తులు స్వామి వారి దర్శనార్థం బారులు తీరారు. ఆలయ అర్చకులు ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో శివాలయాల్లో అభిషే కాలు, జ్వాలాతోరణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. నదీ తీరాన భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో దీపారాధన చేశారు. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి పర్వదినాన ఉపవాసం ఉండి శైవారాధన చేస్తే కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.